# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ మంగళవారం 11-6-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :30 సంచిక:242 పేజీలు:6 వెల: రూ.1/-


## ప్రజల పీఎంవోగా ఉండాలి: ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, జూన్ 10 : ప్రధాన మంత్రి కార్యాలయం ప్రజల కేంద్రంగా ఉండాలని నమ్ముతున్నట్లు ప్రధాని మోదీ(ఖఓ ఓనీటతి) తెలిపారు. మోదీ కేంద్రీకృతమై పీఎంవో ఉండకూడాదన్నారు. మూడవసారి ప్రధానిగా ప్రమాణం చేసిన మోదీ.. ఇవాళ పీఎంవో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.

ఆ తర్వాత జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన పీఎంవో సిబ్బందితో మాట్లాడారు. 2014 ముందకు పీఎంవో కార్యాలయం అధికార కేంద్రంగా ఉండేది, కానీ అది ప్రజలు పీఎంవోగా ఉండాలని విశ్వసిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. తమకు ఒకటే లక్ష్యం ఉందని, ఈ దేశమే ప్రప్రథమం అన్నారు. ఒకే స్ఫూర్తితో పనిచేస్తున్నామని, 2047 నాటికి వికసిత భారత్ నిర్మించాలన్నారు. తన జీవితంలోని ప్రతి క్షణం దేశం కోసమే అని ప్రధాని మోదీ పీఎంవో సిబ్బందితో పేర్కొన్నారు.

### చురక

సమస్యల ప్రవాహాలు
సమసిపోక ఎగిసి పారె
మూడోసారి ఎన్డీయే
ముచ్చటగా కొలువుదీరె/

ఏకపార్టీ ఆధిపత్య
ఏలికకిక ఫుల్ స్టాప్
పెడితేనే ఐదేండ్లు
పాలనకు నాన్ స్టాప్



-వేల్పుల నారాయణ
9440433475

# ప్రధాన మంత్రిగా మూడోసారి బాధ్యతలు స్వీకరించిన నరేంద్ర మోదీ

### -పీఎం కిసాన్ నిధి 17వ విడత నిధులు విడుదల చేస్తూ ఫైల్‌పై తొలి సంతకం



న్యూ డిల్లీ జూన్ 10 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ప్రధాన మంత్రిగా నరేంద్ర మోదీ మూడోసారి బాధ్యతలు స్వీకరించారు . ఢిల్లీలోని సెంట్రల్ సెక్రటేరియట్ సౌత్ బ్లాక్‌లోని పీఎంవోలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పీఎం కిసాన్ నిధి ) 17వ విడత నిధులు విడుదల చేస్తూ ఫైల్‌పై తొలి సంతకం చేశారు. దీనివల్ల 9.3 కోట్ల మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది. దాదాపు రూ.20 వేల కోట్ల ఆర్థిక సాయం అందనుంది.బాధ్యతలు స్వీకరించిన అనంతరం మోదీ మాట్లాడుతూ.. రైతు సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అందుకే రైతు సంక్షేమానికి సంబంధించిన ఫైల్‌పైనే తొలి సంతకం చేసినట్లు తెలిపారు. రైతుల కోసం, వ్యవసాయ రంగం అభివృద్ధి కోసం మున్ముందు మరిన్ని చర్యలు తీసుకోనున్నట్లు ప్రధాని వెల్లడించారు. కాగా, ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ వరుసగా మూడోసారి ఎన్నికైన విషయం తెలిసిందే. ఆదివారం రాత్రి న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో అట్టహాసంగా జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రమాణస్వీకారం చేశారు. మోదీ సహా 72 మందితో కేంద్ర క్యాబినెట్ కూడా ఏర్పాటైంది. ప్రధాని, మంత్రులతో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రమాణస్వీకారం చేయించారు. 30 మందికి క్యాబినెట్ మంత్రులుగా అవకాశం లభించింది. మరో ఐదుగురిని స్వతంత్ర హోదాతో సహాయ మంత్రులుగా, 36 మందిని సహాయ మంత్రులుగా మంత్రివర్గంలోకి తీసుకున్నారు.

## ఖాళీగా ఉన్న 13 అసెంబ్లీ సీట్లకు ఉపఎన్నికలు

న్యూఢిల్లీ జూన్ 10 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: భారత ఎన్నిక సంఘం (ఈసిఐ) ఖాళీగా ఉన్న 13 అసెంబ్లీ సీట్లకు ఉపఎన్నికలు నిర్వహిస్తామని సోమవారం ప్రకటించింది. ఖాళీగా ఉన్న అసెంబ్లీ సీట్లు ఇలా ఉన్నాయి..బీహార్ (1), పశ్చిమబెంగాల్ (4), తమిళనాడు(1), మధ్యప్రదేశ(1), ఉత్తరాఖండ్(2), పంజాబ్(1), హిమాచల్ ప్రదేశ్(3). జులై 10న వీటికి ఉపఎన్నికలు నిర్వహిస్తారు. ఓట్ల లెక్కింపు జులై 13న జరుగనున్నది.

నామినేషన్ ల దాఖలు చివరి తేదీ: జూన్ 21,నామినేషన్ల పరిశీలన: జూన్ 24,అభ్యర్థుల ఉపసంహరణ చివరి తేదీ: జూన్ 26,పోలింగ్ తేదీ: జులై 10,ఫలితాలు: జులై 13.ఉపఎన్నికలు అనేవి అధికారంలో ఉన్న అభ్యర్థి రాజీనామా చేసినా లేక చనిపోయినా ఏర్పడిన ఖాళీ స్థానానికి జరుగుతాయి.

# రేవంత్ చేతుల మీదుగా టెన్త్ విద్యార్థులకు సత్కారం..



హైదరాబాద్, జూన్ 10 : గవర్నమెంట్ స్కూల్ పదో తరగతిలో టాపర్ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు రవీంద్ర భారతిలో ఇవాళ సన్మాన కార్యక్రమం నిర్వహించారు.. వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ పదో తరగతిలో ఉత్తమ ఫలితాలను అందించిన విద్యార్థులను సత్కరించారు.. వారికి జ్ఞాపికలతో పాటు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తే బాగుండేదన్నారు. వందేమాతరం ఫౌండేషన్ ఇలాంటి మంచి కార్యక్రమం ద్వారా మా బాధ్యతను గుర్తు చేసిందని, ప్రయివేట్ పాఠశాలలతో పోటీపడి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు రాణించడం ప్రభుత్వానికి గర్వకారణమన్నారు. కార్పొరేట్ పాఠశాలలతో తమ విద్యార్థులు పోటీపడటం తమ గౌరవాన్ని మరింత పెంచిందని, విద్యార్థిని విద్యార్థులకు హృదయ పూర్వక అభినందనలు తెలిపారు రేవంత్ రెడ్డి.

అంతేకాకుండా.. '90శాతం ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ప్రభుత్వ పాఠాశాలల్లో చదివినవారే. నాతో సహా ప్రముఖ రాజకీయ నాయకులంతా ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో చదివినవారే.. విద్యార్థులు రావడం లేదని సింగిల్ టీచర్ పాఠశాలలను మూసివేసే పరిస్థితి గత ప్రభుత్వంలో ఉండేది.. మౌలిక వసతులపై దృష్టి కేంద్రీకరించకపోవడం వల్లే ఈ పరిస్థితి. కానీ సింగిల్ టీచర్ పాఠశాలలను మూసేయొద్దని మా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రతీ గ్రామం, ప్రతీ తండాకు విద్యను అందించేలా ప్రభుత్వం ముందుకెళుతుంది. శిథిలావస్థకు చేరిన అన్ని ప్రభుత్వ పాఠశాలల భవనాలను పునర్నిర్మించేందుకు రూ.2వేల కోట్లతో పనులు ప్రారంభించాం. విద్యార్థులను బడిలో చేర్పించేందుకు ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోంది.. ప్రభుత్వ పాఠశాలల నిర్వహణను మహిళా సంఘాలకు అప్పగించాం. గ్రీన్ ఛానెల్ ద్వారా నిధులు విడుదల చేయాలని అధికారులను ఆదేశించాం. ప్రభుత్వ పాఠశాలల్లో సెమీ రెసిడెన్షియల్ విధానాన్ని అమలు చేసే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది.

రెసిడెన్షియల్ స్కూల్ ద్వారా తల్లిదండ్రులకు పిల్లల సంబంధాలు బలహీనపడుతున్నాయని ఒక స్టడీ రిపోర్ట్ వచ్చింది. గ్రామాల్లో ఉండే పాఠశాలలపై నిర్లక్ష్యం వహించొద్దు.. విద్య మీద ప్రభుత్వం పెట్టేది ఖర్చు కాదు.. పెట్టుబడి.. విద్యపై పెట్టె పెటుబడి మన సమాజానికి లాభాన్ని చేకూరుస్తుంది.. త్వరలో విద్య, వ్యవసాయ కమిషన్ లను ఏర్పాటు చేసి నిరంతరం సమస్యలను పరిష్కరించే వెసులుబాటు కల్పించబోతున్నాం. మా ప్రభుత్వానికి భేషజాలు లేవు.. ఎవరైనా సలహాలు ఇస్తే స్వీకరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. 10/10 వచ్చిన విద్యార్థుల అడ్మిషన్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు ఆదేశిస్తున్నా? ఇంటర్మీడి యట్ లోనూ స్టేట్ ర్యాంకులు సాధించి భవిష్యత్ లో రాణించాలని ఆకాంక్షిస్తున్నా.. మీకు ప్రజా ప్రభుత్వం ఉం ది.. ప్రజా పాలనపై నమ్మకం కలిగిం చేలా ముందుకెళతాం.' అని సీఎం అన్నారు.

## ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ కింద 2 కోట్ల అదనపు గృహాలు..

న్యూ డిల్లీ జూన్ 10 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );కేంద్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే సర్కార్ మరోసారి అధికారం చేపట్టింది. ప్రధాన మంత్రిగా నరేంద్ర మోదీ వరుసగా మూడోసారి ప్రమాణస్వీకారం చేశారు. మోదీ సహా 72 మందితో కేంద్ర కేబినెట్ కూడా ఏర్పాటైంది. ఈ నేపథ్యంలో మోదీ 3.0 కేబినెట్ ఇవాళ తొలిసారి సమావేశం కానుంది. సాయంత్రం 5 గంటలకు ఢిల్లీలోని లోక్‌కల్యాణ్ మార్గ్‌లోని ప్రధాని నివాసంలో కేబినెట్ మంత్రులు సమావేశం కాబోతున్నారు.ఈ సమావేశంలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ కింద 2 కోట్ల అదనపు గృహాలను ఆమోదించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. అంతేకాకుండా ఈ పథకం కింద లబ్ధిదారులకు అందించే సాయాన్ని దాదాపు 50 శాతం పెంచే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు సోమవారం వెల్లడించాయి.

# అధికారులూ... ఇక పరుగులు పెట్టాల్సిందే- ఉప ముఖ్యమంత్రి భట్టి



హైదరాబాద్, జూన్ 10 :ఎన్నికల కోడ్ ముగిసింది అధికారులు అభివృద్ధి పనుల వేగవంతం పెంచాలన్నారు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. ఇది ప్రజా ప్రభుత్వమని, ప్రజలకు హామీలు ఇచ్చామన్నారు. అధికారుల జవాబుదారీ తనంతో పనిచేయాలని తెలిపారు. ఖమ్మం జిల్లా మధిర క్యాంపు కార్యాలయంలో మధిర అభివృద్ధిపై నేడు అధికారులతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మధిరలో అండర్ డ్రైనేజీ నిర్మాణం కోసం 128 కోట్ల రూపాయలు నిధులు విడుదల చేస్తూ జీవో జారీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, అధికారులు అలసత్వం ప్రదర్శిం చకుండా , ప్రభుత్వ పథకాలను ప్రజలలోకి తీసుకెళ్లాల న్నారు.. ఈ సమావేశానికి మున్సిపల్ చైర్ పర్సన్, కౌన్సిలర్లు , అధికారులు వివిధ రాజకీయ పార్టీ నేతలు హాజరయ్యారు.

## నకిలీ మందుల తయారీదారులపై కఠిన చర్యలు : మంత్రి దామోదర రాజనరసింహ

హైదరాబాద్, జూన్ 10 :రాష్ట్ర ప్రభుత్వం నకిలీ మందుల తయారీదారులపై ఉక్కు పాదంతో అణిచివేయడానికి చర్యలు చేపట్టింది. నకిలీ మందుల నివారణకై నిరంతర పర్యవేక్షణ కోసం నూతనంగా డ్రగ్ ఇన్‌స్పెక్టర్స్ నియామకాలను చేపట్టిందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనరసింహఅన్నారు.

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా మెరిట్ ఆధారంగా ఎంపికైన 17 మంది డ్రగ్ ఇన్‌స్పెక్టర్లకు మంత్రి దామోదర్ రాజనర్సింహ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతనంగా ఎంపికైన ది డ్రగ్స్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు శాఖ బలోపేతానికి కృషి చేయాలని ఆదేశించారు. ఎంతో బాధ్యతగా సమాజ హితం కోసం ఉద్యోగ విధులను నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్, డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్, డైరెక్టర్ జనరల్ ఆర్వీ కర్ణన్, జాయింట్ డైరెక్టర్ రామ్ దాన్ పాల్గొన్నారు.

# మోదీ కేబినెట్‌లో విద్యాధికులే అధికం.

### -మాస్టర్స్ డిగ్రీలు పూర్తి చేసిన ప్రధాని మోదీ, రాజ్‌నాథ్ సింగ్
### -ఎంబీఏ పూర్తి చేసిన ముగ్గురు మంత్రులు
### -పోస్టు గ్రాడ్యుయేషన్ పాసైన 10 మంది మినిస్టర్లు
### -పట్టభద్రులుగా ఆరుగురు అమాత్యులు
### -ఆరుగురు న్యాయవాదులకు మంత్రి పదవులు

న్యూఢిల్లీ, జూన్ 10 :ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కొత్త కేబినెట్ ఆదివారం రాత్రి కొలువుదీరింది. మొత్తం 72 మందితో కేంద్ర మంత్రి మండలి ఏర్పడింది. 30 మంది కేబినెట్ మంత్రులు, ఐదుగురు స్వతంత్ర హోదా కలిగిన సహాయ మంత్రులు, 36 మంది సహాయ మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. అయితే ఆసక్తికరంగా కేంద్ర కేబినెట్ హోదా దక్కించుకున్న మంత్రుల్లో ఏకంగా ఆరుగురు న్యాయవాదులు ఉన్నారు. ఇక ముగ్గురు ఎంబీఏ డిగ్రీ పొందినవారు, పది మంది పోస్ట్ గ్రాడ్యుయేట్లు ఉన్నారు.

ప్రధాని నరేంద్ర మోదీ, రాజ్‌నాథ్‌సింగ్ మాస్టర్స్ డిగ్రీలు చేయగా, మంత్రుల జాబితాలో నితిన్ గడ్కరీ, జేపీ నడ్డా, పీయూష్ గోయల్, సర్బానంద సోనోవాల్, భూపేందర్ యాదవ్, కిరెన్ రిజిజు న్యాయవాద పట్టాలు పొందారు. ఇక రాజ్‌నాథ్ సింగ్, శివరాజ్ సింగ్ చౌహాన్, నిర్మలా సీతారామన్, ఎస్. జైశంకర్, ధర్మేంద్ర ప్రధాన్, డాక్టర్ వీరేంద్ర కుమార్, మన్సుఖ్ మాండవీయ, హర్దీప్ సింగ్ పూరి, అన్నపూర్ణా దేవి, గజేంద్ర సింగ్ షెకావత్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు.

మరోవైపు కేంద్ర కేబినెట్‌లో చోటు దక్కించుకున్న మనోహర్ లాల్, హెచ్‌డీ కుమారస్వామిలతో పాటు జితన్ రామ్ మాంఝీ, రాజీవ్ రంజన్ (లలన్ సింగ్), ప్రహ్లాద్ జోషి, గిరిరాజ్ సింగ్‌లతో సహా ఆరుగురు మంత్రులు పట్టభద్రులుగా ఉన్నారు.






# టీఎస్ పీజీఈసెట్ 2024 ప్రవేశ పరీక్ష ప్రశాంతం..

హైదరాబాద్, జూన్ 10 : టీఎస్ పీజీఈసెట్ -2024 ప్రవేశ పరీక్ష విజయవంతంగా ముగిసింది. హైదరాబాద్, వరంగల్‌లో ఆన్‌లైన్‌లో కంప్యూటర్ బేస్డ్ విధానంలో నిర్వహించారు. ఎంఈ, ఎంటెక్, ఎం ఫార్మ్, ఎం ఆర్క్, గ్రాడ్యుయేట్ లెవల్ ఫార్మ్ డీ కోర్సుల్లో ప్రవేశాల నిమిత్తం ఈ పరీక్ష నిర్వహించినట్లు కన్వీనర్ పేర్కొన్నారు.

ఈ ప్రవేశ పరీక్షను రెండు సెషన్లలో నిర్వహించారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు నిర్వహించిన సెషన్‌లో జియో ఇంజినీరింగ్ అండ్ జియో ఇన్ఫర్మెటిక్స్, ఫార్మసీ కోర్సులకు ప్రవేశ పరీక్ష జరిగింది. ఈ సెషన్‌లో 7,461 మంది అభ్యర్థులకు గానూ 7179 మంది హాజరయ్యారు. 96.22 శాతం మంది పరీక్ష రాశారు. మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు నిర్వహించిన రెండో సెషన్‌లో సివిల్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్, ఫుడ్ టెక్నాలజీ, ఏరోస్పేస్ ఇంజినీరింగ్ వంటి కోర్సులకు ప్రవేశ పరీక్ష జరిగింది. ఈ సెషన్‌కు 5477 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 4898 మంది హాజరయ్యారు. 89.43 శాతం మంది పరీక్ష రాశారు.

## పైరవీలు చేసి పొందిన పెన్షన్‌లు రద్దు చేస్తాం - మంత్రి పొంగులేటి

హైదరాబాద్, జూన్ 10 :గత ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా అనర్హులు పైరవీలు చేసి పెన్షన్ తీసుకుంటే వాటన్నింటినీ ఆపేస్తామని రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం లో నేడు ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ.. రెవిన్యూ అధికారులు గ్రామాల్లో సభలు పెట్టి భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. పరిష్కారం కాని భూమి సమస్యలు తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.తెలంగాణ ప్రజల కష్టఫలితంగానే ఇందిరమ్మ రాజ్యం వచ్చిందని, మూడు సంవత్సరాల్లో పాలేరు నియోజకవర్గంలో అర్హులైన వారందరికీ ఇళ్ళ స్థలం, ఇళ్ళు ఇచ్చే బాధ్యత తనదేనని మంత్రి పొంగులేటి అన్నారు. అర్హులైన పేదలకు పెన్షన్ ఇవ్వాలన్నదే ఈ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. గ్రామాల్లో ఇళ్ళపై నుంచి వెళ్లిన హై టెన్షన్ విద్యుత్ లైన్లను కూడా రెండు నెలల్లో మార్పిస్తామని చెప్పారు. వర్షాకాలం సాగుకు చివరి భూముల వరకు నీళు వచ్చే విధంగా అధికారులు చూడాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు.

## సికింద్రాబాద్ డివిజన్‌లో 2.7 కోట్ల విలువ చేసే మాదక ద్రవ్యాలు సీజ్

హైదరాబాద్, జూన్ 10 : సికింద్రాబాద్ రైల్వే డివిజన్‌లో ఈ ఏడాది ఆరంభం నుంచి ఇప్పటి వరకు భారీగా మాదక ద్రవ్యాలు(డ్రగ్స్) పట్టుబడినట్టు రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్పీఎఫ్) పోలీసులు వెల్లడించారు. ఆపరేషన్ నార్కో కింద తనిఖీలు నిర్వహించామన్నారు. మొత్తం 37 తనిఖీల్లో రూ. 2.7 కోట్ల విలువ చేసే 1,084 కిలోల డ్రగ్స్‌ను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ కేసుల్లో మొత్తం 36 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు.

డ్రగ్స్‌ను ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి రైళ్లలో తరలించడం, స్టేషన్ పరిసరాల్లో విక్రయించడం వంటి వాటిపై నిఘా పెట్టి నిందితులను అరెస్టు చేశామన్నారు. 2023 ఏడాదిలో 22.2 కోట్ల విలువ చేసే మాదక ద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నట్లు గుర్తు చేశారు. డ్రగ్స్ వల్ల యువత చెడిపోతున్నారని పోలీసులు పేర్కొన్నారు.

### నేటి కందం- నేటికీ అందం

నేటినిజం నేటినిజంనేటినిజం నేటినిజం నేటినిజంనేటినిజం నేటినిజం నేటినిజంనేటినిజం నేటినిజంనేటినిజం నేటినిజం

చలువలతో భాసిల్లుచు
విలువలు పెంపొందజేయు విమల తలముగా
వెలసిల్లెడి యఘ్యమ్మును
పలుమారులు ప్రస్తుతింతు భక్తి ప్రపత్తిన్

(11-6-1935 ఈఓ రేడియో మొట్టమొదటి ప్రసారం)



-రాధశ్రీ
సెల్:9494481210

## వర్షాకాలంలో వాహనదారులు జాగ్రత్తలు పాటించాలి : తెలంగాణ డీజీపీ

హైదరాబాద్, జూన్ 10 :వాహనదారులు వర్షాకాలంలో తగు జాగ్రత్తలు పాటించాలని తెలంగాణ డీజీపీ రవి గుప్తా సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు. వాహనాల కండిషన్ ను ఎప్పటికప్పుడు చెక్ చేసుకుంటూ, పరిమిత వేగంతో జాగ్రత్తగా ప్రయాణించాలని చెప్పారు. ఈ సీజన్ లో డ్రైవింగ్ చేసే ముందు, డ్రైవింగ్ చేస్తున్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలకు సంబంధించి డీజీపీ చేసిన సూచనలు ఇవే..

వాహనం టైర్ల గ్రిప్/థ్రెడ్ ను సంబంధిత నిపుణులతో చెక్ చేయించాలి. గ్రిప్ బాగోలేకపోతే వెంటనే టైర్లను మార్చుకోవాలి.

టైర్ల గాలిని ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలి.

వర్షంలో ప్రయాణిస్తున్నపుడు పరిమిత వేగంతో వెళ్లడం మంచిది.

వాహనం ఇంజిన్ కండిషన్ ఎలా ఉందో చెక్ చేసుకోవాలి.

బ్రేక్స్ పాడ్స్, విండ్ స్క్రీన్ వైపర్ల కండిషన్ ఒకటికి రెండు సార్లు చెక్ చేయించడం మేలు.

వాహనాల్లో ఎమర్జెన్సీ కిట్లు అందుబాటులో ఉండేలా చూసుకోవాలి.

అత్యవసర సమయాల్లో చఆతిజీశ్రీ100 కి కాల్ చేసేలా మొబైల్/ వాహనంలో స్పీడ్ డయల్ ఏర్పాటు చేసుకోవాలి. దీనివల్ల వెంటనే సాయం అందే వీలుంటుంది.

# జనసేనకు ఆదిలోనే తొలి ఎదురుదెబ్బ

అమరావతి జూన్ 10 (ఎక్స్ ప్రెస్ న్యూస్); : కూటమిగా గెలిచిన తరువాత జనసేనకు ఆదిలోనే తొలి ఎదురుదెబ్బ తగిలింది. కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వాలు ఏర్పాటు కానున్నాయి. పవన్ గురించి ప్రశంసలు గుప్పించారు. పవన్‌ను ఇష్టపడే ప్రధాని జనసేనకు ఎందుకు అవకాశం ఇవ్వలేదు, అసలు అడ్డు పడిందెవరు? అనే దానిపై చర్చ మొదలైంది. కొలువు తీరుతున్న ప్రభుత్వం కేంద్రంలో మోడీ ప్రభుత్వం కొలువుదీర నుంది. ఎపి నుంచి టిడిపికి రెండు మంత్రి పదవులు దక్కాయి. బిజెపి నుంచి ఒకరికి అవకాశం ఇచ్చారు. మిత్రపక్షాలుగా ఉన్న పార్టీలకు భాగ స్వామ్యం కల్పించారు. కానీ, ఎపిలో ఎన్డీఏ కూటమి విజయంలో కీలకంగా వ్యవహరించిన పవన్ కల్యాణ పార్టీకి అవకాశం ఇవ్వలేదు. టిడిపి నుంచి చంద్రబాబు సూచించిన ఇద్దరూ కేంద్ర మంత్రి వర్గంలోకి తీసుకున్నారు. బిజెపి నుంచి పార్టీ కార్యకర్తకు ప్రాధాన్యత ఇవ్వాలనే లక్ష్యంతో పురందేశ్వరి పేరు ప్రచారం జరిగినా చివరకు నర్సాపురం ఎంపి శ్రీనివాస వర్మకు అవకాశం కల్పించారు. ఇక..జనసేన నుంచి ఇద్దరు ఎంపిలు గెలుపొందారు. మిత్రపక్షాలకు అవకాశం ఇచ్చే క్రమంలో అయిదుగురు కంటే తక్కువ ఎంపిలు ఉన్న పార్టీల్లో ఒకరికి సహాయ మంత్రి హోదాతో మంత్రి పదవి ఇవ్వాలని ఎన్డీఏలో నిర్ణయించారు. అదే విధంగా మంత్రి పదవుల కేటాయింపు జరిగింది. టిడిపికి ఒక కేబినెట్, ఒక సహాయ మంత్రి పదవి దక్కింది. జనసేన నుంచి బాలశౌరి పేరు చివరి వరకు ప్రచారం సాగింది. అయితే ఎంపిక లిస్టులో మాత్రం జనసేన ఎంపిల పేర్లు కనిపించ లేదు. అసలు కేంద్ర కేబినెట్‌లో చేరేందుకు పవన్ ముందుకు రాలేదా? ఎవరి పేరు సూచించలేదా? లేక ఏం జరిగింది? అనేది ఇప్పుడు జనసేనలో ఆసక్తి కర చర్చకు కారణంగా మారుతోంది. కేడర్‌లో అసంతృప్తి కనిపిస్తోంది. ఎపిలో ఎన్డీఏ విజయంలో పవన్‌దే కీలక పాత్ర అంటూ ఎన్డీఏ సమావేశంలో ప్రధాని మోడీ అభినందించారు. పవన్ అంటే సునామీ అంటూ ప్రశంసించారు. కానీ, ఇప్పుడు జనసేనకు అవకాశం ఇవ్వ లేదు. దీని వెనుక చంద్రబాబు ద్వారా విస్తరణ సమయం వరకు వేచి చూడాలని పవన్‌ను ఒప్పించారనే వాదన పార్టీలో వినిపిస్తోంది. టిడిపికి రెండు పదవుల్లో ఒకటి జనసేనకు ఇచ్చి విస్తరణ సమయంలో టిడిపికి మరోకటి ఇచ్చి ఉంటే బాగుండేదనే అభిప్రాయం జనసైనికులు వ్యక్తం చేస్తున్నారు. ఎపిలో కూటమి అధికారంలో రావటానికి, టిడిపికి తిరిగి సిఎం పదవి దక్కటానికి పవన్ ప్రధాన కారణమని అందరూ అంగీకరించే అంశం. కానీ, కేంద్ర మంత్రి పదవి విషయంలో మాత్రం జనసేనకు ప్రాధాన్యత ఇవ్వకపోవటం ఇప్పుడు ఎపి రాజకీయాల్లో కీలక అంశంగా మారుతోంది.

# విద్యుత్ షాక్‌తో అన్నదమ్ముల మృతి..



అమరావతి, జూన్ 10 :పశ్చిమ ప్రకాశం ప్రతినిధి, ప్రభన్యూస్ : ప్రకాశం జిల్లా గిద్దలూరులో విషాదం చోటుచేసుకుంది. టాటా ఏస్ వాహానానికి విద్యుత్ వైర్లు తగిలి అన్నదమ్ములు ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. గిద్దలూరు సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద జరిగిందీ ఘటన. మృతులు గిద్దలూరు మండలం ముండ్లపాడు గ్రామానికి చెందిన లోకి(17), సాయి(14)లుగా గుర్తించారు. ఓ శుభకార్యానికి ఆటోలో సప్లయర్స్ సామాన్లు తీసుకువచ్చి తిరిగి వాటిని తరలిస్తున్న సమయంలో ఆటోకు నీటి బోరుకు సంబంధించిన విద్యుత్తు వైర్ తాకింది.దీంతో విద్యుత్తు ఆటోకు సరఫరా కావడంతో షాక్? కొట్టి ఆటోలో ఉన్న ఇద్దరు అన్నదమ్ములు అక్కడికక్కడే మృతి చెందారు. విద్యుత్ షాక్?కు గురైన వారిని కుటుంబ సభ్యులు స్థానిక ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. కానీ అప్పటికే ఇద్దరు మృతిచెందినట్లుగా వైద్యులు నిర్ధారించారు. ఒకే కుటుంబంలో ఇద్దరు మృతిచెందడంతో ఆ కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

# మధుగురు అక్షర యజ్ఞం కరపత్రాన్ని విడుదల చేసిన డా. పింగిళి విజయపాల్ రెడ్డి



హైదరాబాద్ జూన్ 10 (ఎక్స్ ప్రెస్ న్యూస్);పిల్లలకు ఉన్నత చదువులు పెద్దలకు ఉపాధి మార్గాలూ అందించాలన్న సంకల్పంతో జూకల్ గ్రామ కేంద్రంగా రైతు మధుకర్ అధ్వర్యంలో నిర్వహించబడుతున్న మధుగురు అక్షర యజ్ఞం కరపత్రాన్ని డా. పింగిళి విజయపాల్ రెడ్డి తమ నివాసములో ఆవిష్కరించారు. అక్షరయజ్ఞం లో భాగంగా 10 వ తరగతి వరకు చదువుతున్నా పిల్లలకు కలిగే విద్య పరమైనస సందేహాలను ఫోన్ ద్వారా నివృత్తి చేయడానికి ఉత్తమ బోధకులచే జాతీయ స్థాయిలో ఫోన్ ద్వార విద్యా బోధన కార్యక్రమం నిర్వహిస్తున్నామని కార్యక్రమంలో పాల్గొనాలనే ఆసక్తి ఉన్నవారు 9491504405 కు తమ వివరాలు పంపగలరని యజ్ఞం నిర్వాహకులు రైతు మధుకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజేశ్వర్ రావు ,బాలకృష్ణ ,పోనగంటి బాలకృష్ణ పాల్గొన్నారు.

# మోడీ హ్యాట్రిక్ పీఎం కావడం ఒక చరిత్రే-ఈటల రాజేందర్



న్యూఢిల్లీ, జూన్ 10 :నరేంద్ర మోడీ ఒకే పార్టీ నుండి మూడోసారి ప్రధానమంత్రి కావటం అనేది ఒక చరిత్ర అని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు, మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. 1962 తర్వాత మూడవసారి ఒకే పార్టీ నుండి ఒకే వ్యక్తి ప్రధాని కావడం చాలా అరుదైన విషయమన్నారు. ఢిల్లీలో కేంద్ర మంత్రి అమిత్ షా ను నేడు ఈటెల కలిశారు. ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ. యావత్తు దేశ ప్రజలు తమ ఆత్మను ఆవిష్కరించి ఓట్లు వేశారని పేర్కొన్నారు. బీజేపీ పార్టీ 2014లో, 2019లో చేసిన అభివృద్ధికి ప్రజలు ఎంతగానో సంతోషించి మూడవసారి కూడా అధికారం అప్పజెప్పారన్నారు.

దేశంలోనే పెద్ద నియోజక వర్గమైన మల్కాజ్ గిరి నుండి దాదాపు నాలుగు లక్షల మెజారిటీతో తనను గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో రాష్ట్రంలో మంత్రిగా కొనసాగినప్పటికీ, కేంద్ర ప్రభుత్వంతో కలిసి మోడీ నాయకత్వంలో లోక్‌సభలో ఎంపీగా కొనసాగడం తనకు ఎంతో గర్వంగా ఉందన్నారు. దేశంలోని పేదరిక నిర్మూలనకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందని ఈటల రాజేందర్ అన్నారు.

### బండి, కిషన్ రెడ్డిలకు కూడా అభినందనలు...

తెలంగాణ రాష్ట్రం నుంచి కేంద్ర మంత్రులుగా ఎంపికైన కిషన్ రెడ్డి, బండి సంజయ్ లను బీజేపీ కార్యవర్గ సభ్యులు, మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## భైరాన్ పల్లిలో బయటపడ్డ చాళుక్యుల నాటి శిల

సిద్దిపేట జూన్ 10 (ఎక్స్ ప్రెస్ న్యూస్);సిద్దిపేట జిల్లా దూల్మిట్ట మండలంలోని భైరాన్ పల్లిలో పురాతన శిల బయటపడింది. గ్రామంలోని పురాతన జైన ఆలయం ఆవరణలో గ్రామస్థులు ఈ శిలను గుర్తించారు. స్థానికంగా అంగడి వీరన్న శివాలయంగా పిలిచే ఈ ఆలయం ఆవరణలో ఇటీవలి వర్షాలకు చిన్న గుంత ఏర్పడింది. అందులో ఈ శిలను గుర్తించి బయటకు తీసినట్లు గ్రామస్థులు తెలిపారు. దీనిపై పురావస్తు శాఖకు సమాచారం ఇవ్వగా.. గ్రామానికి చేరుకున్న అధికారులు ఆ శిలను పరిశీలించి అది చాళుక్యుల కాలం నాటిదని వెల్లడించారు.పురావస్తు శాఖ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ తాజాగా బయటపడ్డ ఈ శిల జైన చౌముఖి శిల్పం అని, 5 అడుగుల ఎత్తుతో చెక్కారని చెప్పారు. నలువైపులా ఉన్న శిల్పాలు 24వ జైన తీర్థంకరుడు మహా వీరుడి ధ్యానం చేస్తున్న చిత్రాలని వివరించారు. గతంలో ఈ తరహా శిల్పాలను కొలనుపాక, వేములవాడలో గుర్తించామని చెప్పారు. జైనులు వీటిని 'సర్వతోభద్ర' అంటూ వ్యవహరిస్తారని తెలిపారు. ఈ శిల్పాలు లభించిన ప్రాంతాలు గతంలో జైనధర్మ కేంద్రాలుగా విరాజిల్లాయని వివరించారు. బౌద్ధుల తరహాలోనే జైనులు కూడా స్తూపాలు, చైత్యాలు నిర్మించుకునేవారని, గ్రామంలోని అంగడి వీరన్న శివాలయం ముందున్న శాసనాల ద్వారా తెలుస్తోందని శ్రీనివాస్ చెప్పారు.

## వైసీపీకి నెల్లూరు మేయర్ రాజీనామా..

అమరావతి, జూన్ 10 :వైసీపీకి షాక్ తగిలింది. నెల్లూరు మేయర్ స్రవంతి, ఆమె భర్త జయవర్ధన్ వైసీపీకి రాజీనామా చేశారు. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి వెంట నడుస్తామని వారు వెల్లడించారు. శ్రీధర్ రెడ్డి వల్లే మేయర్ పదవి వచ్చిందని, అధికార పార్టీ బెదిరింపుల వల్లే అప్పుడు పార్టీని వీడామని వారు తెలిపారు.

నెల్లూరు మేయర్ స్రవంతి మాట్లాడుతూ.. వైసీపీకి రాజీనామా చేస్తున్నానని ఆమె చెప్పారు. ఎలాంటి రాజకీయ నేపథ్యం లేకున్నా తనకు కార్పొరేటర్ టికెట్‌ను శ్రీధర్ రెడ్డి ఇచ్చారన్నారు. అంతేకాకుండా మేయర్‌ను చేశారన్నారు. మాలాంటి ఎందరో కార్యకర్తలకు రాజకీయ అవకాశాలు కల్పించారని.. రాజకీయాల్లో తనకు ధైర్యాన్ని ఇచ్చారన్నారు. శ్రీధర్ రెడ్డి వైసీపీని వీడినప్పుడు కూడా ఆయనతోనే ఉంటానని స్పష్టం చేశామన్నారు. అప్పట్లో అధికార పార్టీ నేతల ఒత్తిళ్లతో వైసీపీలోకి వెళ్ళాల్సి వచ్చిందన్నారు.

శ్రీధర్ రెడ్డిపై విమర్శలు చేయాలని అక్కడి నాయకులు ఒత్తిడి తెచ్చారన్నారు. శ్రీధర్ రెడ్డి ఒక్క మాట కూడా మాట్లాడలేదన్నారు. మా తప్పులను శ్రీధర్ రెడ్డి మన్నించి మమ్ములను అక్కున చేర్చుకోవాలని కోరుకుంటున్నామన్నారు. నెల్లూరు కార్పొరేషన్‌లో ఫోర్జరీ ఆరోపణల విచారణ చేయిస్తామన్నారు. తన భర్త జయవర్ధన్‌కు పాత్ర ఉందని ప్రచారం చేయడం సరికాదని.. విచారణలో వాస్తవాలు వెలుగులోకి వస్తాయని మేయర్ స్రవంతి పేర్కొన్నారు.

## వెల్దుర్తిలో తెలుగుదేశం కార్యకర్త హత్య - వీఆర్‌లోకి సిఐ, ఎస్ఐ

అమరావతి, జూన్ 10 :కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలం బొమ్మిరెడ్డిపల్లి ఘటనను ప్రభుత్వం సీరియస్ గా పరిగణించింది. ఈ ఘటన పోలీసు వైఫల్యంగా భావించి సిఐ,ఎస్ఐ లను సోమవారం విఆర్ కు పంపింది. బొమ్మిరెడ్డి గ్రామంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్త గిరినాథ్ చౌదరినీ వైసిపి నేతల హత్య చేసిన సంగతి విధితమే.

దీంతో ఈ ఘటనను పోలీస్ వైఫల్యంగా భావించిన ప్రభుత్వం వెల్దుర్తి సర్కిల్ ఇన్స్పెక్టర్ సురేష్ కుమార్ రెడ్డి, వెల్దుర్తి ఎస్ఐ పి. చంద్రశేఖర్ రెడ్డిలను వీఆర్ నందు రిపోర్ట్ చేసుకోవాలని పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాలు జారీ చేశారు.

కర్నూలు నాలుగవ పట్టణ పోలీస్ స్టేషన్ కు చెందిన ఎస్ఐ యు.సునీల్ కుమార్ వెల్దుర్తి నూతన ఎస్సైగా పదవి బాధ్యతలు చేపట్టడం గమనార్హం.

## ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్ పై దాడి- బస్సు అద్దాలు ధ్వంసం

అమరావతి, జూన్ 10 :నంద్యాల జిల్లా మిడుతూరు మండల పరిధిలోని చింతలపల్లి గ్రామ సమీపంలోని వాగు వద్ద ఆర్టీసీ డ్రైవర్ ముత్తు జవలి, కండక్టర్ శేషన్నపై గుర్తు తెలియని ఆకతాయిలు దాడి చేసి బస్సు అద్దాలు ధ్వంసం చేశారు.

ఆర్టీసీ డ్రైవర్ ముత్తు జావలి పోలీసులకు ఫిర్యాదు చేయగా? ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరిసరాలను పరిశీలించి అక్కడున్న బైక్‌ను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

# కొత్తగా ఏర్పడిన ట్రై-సర్వీసెస్ జాయింట్ ట్రైనింగ్ టీమ్‌లచే శిక్షణ




న్యూఢిల్లీ, జూన్ 10 :ట్రై-సర్వీసెస్ అధికారుల కోసం ఫ్లాగ్‌షిప్ డిఫెన్స్ సర్వీసెస్ టెక్నికల్ స్టాఫ్ కోర్సు 10 జూన్ 2024న పూణేలోని మిలిటరీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ప్రారంభమైంది. ఇండియన్ ఆర్మీ, ఇండియన్ నేవీ, ఇండియన్ ఎయిర్ ఫోర్స్ నుండి మిడ్-కెరీర్ అధికారులకు శిక్షణ ఇచ్చేందుకు రూపొందించబడిన ఈ కోర్సులో ట్రై-సర్వీసెస్, ఇండియన్ కోస్ట్ గార్డ్, మరియు స్నేహపూర్వక విదేశీ దేశాల నుండి ఐదుగురు అధికారులతో సహా మొత్తం 166 మంది అధికారులు పాల్గొంటున్నారు.

భారత కోస్ట్ గార్డ్ మరియు స్నేహపూర్వక విదేశీ దేశాలు, భవిష్యత్ టెక్నో-యోధులు మరియు సైనిక నాయకులుగా.

MILIT యొక్క కమాండెంట్, వివేక్ బ్లూరియా, భవిష్యత్ సైనిక నాయకులను ఉద్దేశించి తన ప్రారంభ ప్రసంగంలో, సేవల మధ్య ఉమ్మడి మరియు సినర్జీ యొక్క ప్రాముఖ్యతను మరియు బహుళ-డొమైన్ కార్యకలాపాలలో యుద్ధ పోరాటానికి ప్రతి సేవ యొక్క ప్రత్యేక సామర్థ్యాలను అర్థం చేసుకోవడంలో క్లిష్టతను నొక్కి చెప్పారు.

భారతదేశ సైనిక మరియు భద్రతా రంగం మీద ప్రభావం చూపుతున్న అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు మరియు భౌగోళిక రాజకీయ సమస్యలపై భవిష్యత్ టెక్నో-యోధులు బలమైన అవగాహనను పెంపొందించుకోవాల్సిన అవసరాన్ని కూడా కమాండెంట్ హైలైట్ చేశారు. ఈ అవగాహన వారికి సమాచారంతో కూడిన నిర్ణయాలు తీసుకోవడానికి మరియు సేవల్లో నమూచిత సాంకేతికతలను గ్రహించడంతోపాటు సైనిక వ్యూహాలకు సమర్థవంతంగా దోహదపడేందుకు వారికి శక్తినిస్తుంది.

కోర్సులో, అధికారులు వివిధ అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు, రక్షణ వ్యూహాలు, ప్రత్యక్ష మరియు అనుకరణ కసరత్తులు, సెమినార్లు, సహకార ప్రాజెక్టులు, వివిధ ఫార్వర్డ్ ప్రాంతాలతో పాటు రక్షణ ఆర్ & డి మరియు పారిశ్రామిక కారిడార్‌లను సందర్శించి జాతీయ భద్రతా వ్యూహంపై అవగాహన మరియు అవగాహనను మెరుగుపరుస్తారు. సైనిక సాంకేతికతలలో ఆత్మనిర్భర్త వద్ద వ్యూహాత్మక కార్యకలాపాలు మరియు జాతీయ ప్రయత్నాలు.

MILIT ద్వారా జాయింట్‌నెస్ వైపు ఒక మార్గదర్శక చొరవ, ఉమ్మడి విభాగాలు, విభిన్న నైపుణ్యం సెట్‌లు మరియు దృక్కోణాలను ఒకచోట చేర్చే ట్రై-సర్వీస్‌ల నుండి తీసుకోబడిన అధికారులతో కూడిన జాయింట్ ట్రైనింగ్ కోసం రూపొందించబడ్డాయి. కొత్తగా ఏర్పడిన ట్రై-సర్వీసెస్ జాయింట్ ట్రైనింగ్ టీమ్‌ల ద్వారా శిక్షణ పొందిన మొదటి DSTSC ఇది. బహుళ-డొమైన్ కార్యకలాపాలకు అవసరమైన అతుకులు లేని సమన్వయం మరియు ఏకీకరణను మెరుగుపరచడం మరియు ఉమ్మడి సంస్కృతిని సృష్టించడం ఈ చొరవ లక్ష్యం.

# అటల్ ఇన్నోవేషన్ మిషన్, నీతి ఆయోగ్ వాటర్ ఛాలెంజ్ 4.0 మరియు ఇన్నోవేషన్స్ మీ కోసం.. ఎస్‌డిజి ఎంటర్‌ప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియాను ఆవిష్కరణ

న్యూఢిల్లీ, జూన్ 10 :అటల్ ఇన్నోవేషన్ మిషన్, ఔమిఎ ఆయోగ్ భారతదేశంలో ఆవిష్కరణ మరియు స్థిరత్వాన్ని పెంపొందించే లక్ష్యంతో రెండు సంచలనాత్మక కార్యక్రమాలను ప్రారంభించినట్లు నగర్వంగా ప్రకటించింది: 'AIM - ICDK వాటర్ ఛాలెంజ్ 4.0' మరియు ఐదవ ఎడిషన్ 'ఇన్నోవేషన్స్ ఫర్ యు' హ్యాండ్‌బుక్, స్పాట్‌లైట్ ాఆఉబ. భారతదేశం యొక్క.

భారతదేశంలోని రాయల్ డానిష్ ఎంబసీలో ఇన్నోవేషన్ సెంటర్ డెన్మార్క్ (ఎఅఆఐ) సహకారంతో, ఎఐఎ ఓపెన్ ఇన్నోవేషన్ వాటర్ ఛాలెంజ్ యొక్క నాల్గవ ఎడిషన్‌ను అందిస్తుంది. ఇండో-డానిష్ ద్వైపాక్షిక హరిత వ్యూహాత్మక భాగస్వామ్యానికి మూలస్తంభమైన ఈ చొరవ, నీటికి సంబంధించిన క్లిష్టమైన సవాళ్లను ఆవిష్కరణ పరిష్కారాల ద్వారా పరిష్కరించడానికి ప్రయత్నిస్తుంది. ఎంపికైన జట్లు గ్లోబల్ నెక్స్ట్ జనరేషన్ డిజిటల్ యాక్షన్ ప్రోగ్రామ్‌లో పాల్గొనే భారతీయ కోహోర్ట్‌ను ఏర్పరుస్తాయి మరియు 9 దేశాల (భారతదేశం, డెన్మార్క్, ఘనా, కెన్యా, కొరియా, టాంజానియా, దక్షిణాఫ్రికా, ఘనా) ప్రముఖ విశ్వవిద్యాలయాలు మరియు ఇన్నోవేషన్ హబ్‌ల నుండి యువ ప్రతిభావంతులతో పాలుపంచుకుంటాయి. , కొలంబియా మరియు మెక్సికో).

ఎంచుకున్న జట్ల నుండి పాల్గొనే వారు గ్రూప్ వర్క్, బూట్ క్యాంప్ సెషన్‌లు, కీనోట్‌లు మరియు వ్యక్తిగతీకరించిన మార్గదర్శకత్వంతో కూడిన హైబ్రిడ్ ఇన్నోవేషన్ జర్నీలో నిశ్చితార్థం కోసం ఎదురుచూడవచ్చు. ప్రోగ్రామ్ స్థిరత్వం, డిజిటల్ పరిష్కారాలు, చేర్చడం మరియు సార్వత్రిక రూపకల్పన సూత్రాల అన్వేషణను ప్రోత్సహిస్తుంది. సహచరుల మధ్య సహకార మద్దతు మరియు జ్ఞాన భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తూ, క్రియాశీల [illegible] ప్రోత్సహించబడుతుంది. అదనంగా, పాల్గొనేవారు కోపెన్‌హాగన్‌లో అక్టోబర్ 30 నుండి 31, 2024 వరకు డెన్మార్క్ ప్రభుత్వం నిధులు సమకూర్చే డిజిటల్ టెక్ సమ్మిట్‌లో ఆవిష్కరణలను ప్రదర్శించే అవకాశం ఉంటుంది.

ఛాలెంజ్ రెండు ట్రాక్‌ల క్రింద ఎంట్రీలను ఆహ్వానిస్తుంది: ఒకటి విద్యార్థుల కోసం మరియు మరొకటి 35 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న యువ వ్యాపారవేత్తల కోసం. ప్రారంభ దశ స్టార్టప్‌లు, పరిశోధకులు మరియు యువ ఆవిష్కర్తలు సానుకూల పర్యావరణ మార్పును నడపడానికి కట్టుబడి ఉన్నారని దరఖాస్తు చేసుకోవాలని ప్రోత్సహిస్తారు. విద్యార్థి ప్రయాణం సామాజిక ప్రభావం కోసం డిజిటల్ యాక్షన్‌పై దృష్టి పెడుతుంది, డిజిటలైజేషన్‌పై నిర్దిష్ట దృష్టితో సుస్థిరత సవాళ్ల ద్వారా బాహ్య భాగస్వాములు ముందుకు తెచ్చారు. యంగ్ ఎంటర్‌ప్రెన్యూర్స్ ట్రాక్ ప్రారంభ దశలో భారతీయ టెక్నాలజీ స్టార్టప్‌లకు వారి ఆలోచనలను వేగవంతం చేయడానికి మరియు ప్రపంచ భాగస్వామ్యాలను ఏర్పరచుకోవడానికి అద్భుతమైన అవకాశాన్ని అందిస్తుంది.

ఈవెంట్‌ను ప్రారంభించిన సందర్భంగా మిషన్ డైరెక్టర్ ఎఐఎ, ఔమిఎ ఆయోగ్ డాక్టర్ చింతన్ వైష్ణవ్ మాట్లాడుతూ, "ఎఐఎ ? ఎఅఆఐ వాటర్ ఛాలెంజ్ 4.0 మరియు ఇన్నోవేషన్స్ ఫర్ యు ? ాఆఉ ఎంటర్‌ప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా ఐదవ ఎడిషన్‌ను ప్రారంభించడం పట్ల మేము సంతోషిస్తున్నాము. ఈ కార్యక్రమాలు భారతదేశాన్ని ఉజ్వలమైన, మరింత స్థితిస్థాపకంగా ఉండే భవిష్యత్తు వైపు నడిపిస్తూ, ఆవిష్కరణలు మరియు స్థిరత్వం కోసం మా కనికరంలేని అన్వేషణకు ప్రతిరూపం. ఐసిడికె మరియు భారతదేశంలోని రాయల్ డెన్మార్క్ ఎంబసీ వంటి భాగస్వాముల తో సహకార ప్రయత్నాల ద్వారా, మేము సవాళ్లను పరిష్కరించడం మరియు రెండు దేశాలలో సానుకూల మార్పును తీసుకురావడానికి యువ ఆవిష్కర్తలను ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకున్నాము. స్టార్టప్‌లతో పాటు ఆసక్తి ఉన్న విద్యార్థులందరినీ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని మేము ప్రోత్సహిస్తున్నాము."

మినిస్టర్ కౌన్సెలర్, న్యూ ఢిల్లీలోని ట్రేడ్ కౌన్సిల్ హెడ్ ఉ రీజినల్ కోఆర్డినేటర్ దక్షిణాసియా, రాయల్ డెన్మార్క్ ఎంబసీ సోరెన్ నోరెలుండ్ కన్నిక్-మార్కోర్డ్‌సెన్ తన ప్రసంగంలో ఇలా అన్నారు, "వాటర్ ఛాలెంజ్ గ్రీన్ స్ట్రాటజిక్ పార్టనర్‌షిప్ (జీఎస్‌పి)లో 5 ఎస్‌లను కలిగి ఉన్నందుకు నేను సంతోషంగా ఉన్నాను. ) భారతదేశం మరియు డెన్మార్క్ మధ్య - నైపుణ్యాలు, స్కేల్, స్కోప్, సస్టైనబిలిటీ మరియు స్పీడ్. ఈ ఛాలెంజ్ భారతదేశం మరియు డెన్మార్క్‌లను మాత్రమే కాకుండా మొత్తం ప్రపంచాన్ని ప్రభావితం చేసే ప్రపంచ సవాళ్లను పరిష్కరించడానికి డానిష్ మరియు భారతీయ పారిశ్రామికవేత్తల నైపుణ్యాలను కలపడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ భాగస్వామ్యం నాల్గవ సంవత్సరంలో కొనసాగుతోందని చెప్పడానికి మేము గర్విస్తున్నాము, ఇది మా సహకారం యొక్క విజయాన్ని మాత్రమే కాకుండా ప్రపంచంలోని కొన్ని అత్యంత క్లిష్టమైన సమస్యలను పరిష్కరించడంలో మరియు మరింత స్థిరమైన ప్రపంచాన్ని సృష్టించడంలో యువ ఆవిష్కర్తల అంకితభావాన్ని కూడా సూచిస్తుంది. ఈ రోజు వెబ్‌సైట్‌ను ప్రారంభించేందుకు మేము సంతోషిస్తున్నాము మరియు ప్రపంచంలోని కొన్ని అతిపెద్ద సమస్యలను పరిష్కరించడానికి ఈ అవకాశాన్ని ఉపయోగించుకునేలా యువ ఆవిష్కర్తలను అత్యంత ప్రోత్సహిస్తున్నాము. ఈ ఛాలెంజ్ విజయవంతమైన నాల్గవ ఎడిషన్ కోసం మరియు మా భాగస్వాములందరితో ఈ భాగస్వామ్యాన్ని కొనసాగించాలని మేము ఆశిస్తున్నాము.

# రెడ్ క్రాస్ అధ్వర్యంలో ఉచిత ఎంఎంయు వైద్య శిబిరం




హైదరాబాద్ జూన్ 10 (ఎక్స్ ప్రెస్ న్యూస్);ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హైదరాబాద్ జిల్లా శాఖ వారి అధ్వర్యం లో పాత నగరం లోని ఫలక్ నుమా స్టేషన్ రోడ్ లో ఫాతిమా వృద్ధాశ్రమం నందు 60 సంవత్సరాలు పైబడిన వారికి ఆరోగ్య పరీక్ష నిర్వహించి మందు పంపిని చేయడం జరిగింది. ఈ కార్యక్రమం మొబైల్ మెడికల్ యూనిట్ ద్వార హైదరాబాద్ రెడ్ క్రాస్ చైర్మన్ శ్రీ మామిడి భీమ్ రెడ్డి గారి అధ్వర్యం లో , హైదరాబాద్ డివిజన్ కన్వీనర్ కోటి ధర్మ తేజ, ఎమ్ సీ సభ్యుడు రియాజుద్దీన్ ద్వార ఏర్పటు చెయ్యడం జరిగింది. దాదాపు 60 మంది వరకు రోగులకి డాక్టర్ శ్రీజ రెడ్డి, డాక్టర్ అదీబ్ . సుజాత విజయలక్ష్మి మరియు ఎ ఇ సభ్యులు వీరమణి, శివరాణి రాకేష్, అబ్దుల్ మజీద్ , శివరాణి , రాకేష్ , సందీప్ మరియూ సత్యనారాయణ, మహమ్మద్ అబ్దుల్ వాసిఫ్ లు పాల్గొన్నారు

# మహిళ శస్త్రచికిత్సకు వెస్సో ఆర్థిక సహాయం

గుంటూరు జూన్ 10 (ఎక్స్ ప్రెస్ న్యూస్);గుంటూరు కొత్తపేట నివాసి కోసూరి ప్రసూనాంబ(41) కొంత కాలంగా ఎడమ వైపు థైరాయిడ్ సమస్యతో గొంతు వాచి, నొప్పితో బాధ పడుతూ, కేవలం ద్రవ పదార్థాల పైనే ఆధార పడి జీవిస్తున్నారు. థైరాయిడ్ వాపుకి సర్జరీ చేయలేమని ప్రభుత్వ ఆసుపత్రిలో చెప్పటంతో, వీరు స్థానిక ప్రైవేట్ ఆసుపత్రిలో సంప్రదించగా, సర్జరీకి సుమారుగా రూ.70 వేలు ఖర్చు అవుతుందని అన్నారు. వీరి భర్త కోసూరి చంద్రశేఖర్ పెయింటర్ గా దినసరి వేతనానికి పని చేస్తున్నారు. ఆదా చేసుకున్న డబ్బు ఈపాటికే వైద్యానికి ఖర్చు చేసినందున, ఆర్థిక ఇబ్బందులతో సహాయం కొరకు వెస్సోని సంప్రదించారు. వెస్సో గౌరవ దాతల సహకారంతో చంద్రశేఖర్ గారికి రూ. 40,000/-లు అందచేసింది. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షులు బంగారు తాతారావు మాట్లాడుతూ ప్రసూనాంబ గారి వైద్యానికి ఆర్థిక సహాయం చేసి ఆదుకున్న గౌరవ దాతలకు హృదయపూర్వక ధన్యవాదములు తెలిపారు.

# విద్యుత్ ఒప్పందాలలో అవకతవకలు .. విచారణకు హాజరైన ప్రభాకర్ రావు

హైదరాబాద్, జూన్ 10 :గత ప్రభుత్వ హయాంలో ఛత్తీస్ గఢ్ తో విద్యుత్ ఒప్పందాలు, యాదాద్రి థర్మల్ ప్లాంట్ నిర్మాణ పనుల్లో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు రావడం విచారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్ ను ఏర్పాటు చేసింది.. విచారణలో భాగంగా నేడు ట్రాన్స్ కో, జెన్ కో మాజీ సీఎండీ ప్రభాకర్ రావు, గత ప్రభుత్వంలో ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శిగా పని చేసిన అరవింద్‌కుమార్ హాజరయ్యారు. ఛత్తీస్‌గఢ్ విద్యుత్ ఒప్పందం, ఇతర అంశాలపై ప్రభాకర్ రావు, అరవింద్ నుంచి జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్ వివరాలు సేకరించారు. కాగా రాష్ట్రప్రభుత్వానికి వీలైనంత త్వరగా నివేదిక ఇచ్చేందుకు జస్టిన్ నర్సింహారెడ్డి కమిషన్ విచారణను వేగవంతం చేసింది. విద్యుత్ అంశాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల్లో నిజనిర్ధారణ కోసం ఇప్పటికే బహిరంగ ప్రకటన జారీ చేసి ప్రజాభిప్రాయాన్ని సేకరించింది. పవర్ ప్రాజెక్ట్ ల ఒప్పందాలు, కొత్త విద్యుత్ ప్లాంట్ ల నిర్మాణాలపూ అవగాహన కలిగిన వ్యక్తులు, విద్యుత్ రంగ నిపుణులు, సంస్థల నుంచి సూచనలు కమిషన్ స్వీకరించింది.

# బండి సంజయ్ , కిషన్ రెడ్డిలకు అభినందనలు తెలిపిన ఏలేటి మహేశ్వర్ రెడ్డి



న్యూ డిల్లీ జూన్ 10 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో కేంద్రంలో ఏర్పాటైన ప్రభుత్వంలో కేంద్ర మంత్రిగా అవకాశం పొందిన బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ , బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి ని ఢిల్లీలో కలిసి అభినందనలు తెలిపిన బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యేలు రామారావ్ పటేల్, దన్ పాల్ సూర్యనారాయణ, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మనోహర్ రెడ్డి. మండలి సభాపక్ష నేత కీవీఎలెన్ రెడ్డి, ఎమ్మెల్యేలు రామారావ్ పటేల్, పాల్వాయి హరీష్ బాబు తదితరులు

# జూరాల ప్రాజెక్ట్ కు వరద నీరు..క్రమక్రమంగా పెరుగుతున్న నీటి మట్టం..

హైదరాబాద్, జూన్ 10 :ఉమ్మడి పాలమూరు జిల్లాకు సాగు, త్రాగు నీటి అవసరాలకు వరప్రదాయంగా మారిన ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వరద ప్రవాహం క్రమంగా పెరుగుతోంది. గత కొన్ని రోజులుగా జూరాల ప్రాజెక్టు ఎగువన తెలంగాణ, కర్ణాటక పరిసర ప్రాంతాలలో వర్షాలు కురుస్తుండటంతో జూరాలకు వరద ప్రవాహం మొదలైంది. సోమవారం ఉదయానికి 3,806 క్యూసెక్కుల ఇన్ ఫ్లో నమోదైంది.

ఈ సీజన్‌లో వర్షాలు కురుస్తుండటంతో కృష్ణానదికి స్వల్పంగా వరద మొదలైంది. క్రమంగా వరద ప్రవాహం పెరగడంతో 3,806 క్యూసెక్కుల వరద నీరు జూరాల ప్రాజెక్టులోకి వచ్చి చేరుతున్నది. జూరాల పూర్తిస్థాయి నీటిమట్టం 318.516 మీటర్లు కాగా.. ప్రస్తుతం 315.840 మీటర్లు, 4.936 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది.

# విద్యుత్ ఒప్పందాలలో అవకతవకలు- విచారణకు హాజరైన ప్రభాకర్ రావు

హైదరాబాద్, జూన్ 10 :గత ప్రభుత్వ హయాంలో ఛత్తీస్ గఢ్ తో విద్యుత్ ఒప్పందాలు, యాదాద్రి థర్మల్ ప్లాంట్ నిర్మాణ పనుల్లో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు రావడం విచారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్ ను ఏర్పాటు చేసింది.. విచారణలో భాగంగా నేడు ట్రాన్స్ కో, జెన్ కో మాజీ సీఎండీ ప్రభాకర్ రావు, గత ప్రభుత్వంలో ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శిగా పని చేసిన అరవిందకుమార్ హాజరయ్యారు.

ఛత్తీస్‌గఢ్ విద్యుత్ ఒప్పందం, ఇతర అంశాలపై ప్రభాకర్ రావు, అరవింద్ నుంచి జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్ వివరాలు సేకరించారు. కాగా రాష్ట్రప్రభుత్వానికి వీలైనంత త్వరగా నివేదిక ఇచ్చేందుకు జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్ విచారణను వేగవంతం చేసింది. విద్యుత్ అంశాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల్లో నిజనిర్ధారణ కోసం ఇప్పటికే బహిరంగ ప్రకటన జారీ చేసి ప్రజాభిప్రాయాన్ని సేకరించింది. పవర్ ప్రాజెక్ట్ ల ఒప్పందాలు, కొత్త విద్యుత్ ప్లాంట్ ల నిర్మాణాలపూ అవగాహన కలిగిన వ్యక్తులు, విద్యుత్ రంగ నిపుణులు, సంస్థల నుంచి సూచనలు కమిషన్ స్వీకరించింది.

# ఏపీ నుంచి ఫేక్ సీడ్స్... పత్తి రైతులకు తప్పని గోస



కరీంనగర్, జూన్ 10 : ఆరుగాలం శ్రమించే రైతులు నకిలీ విత్తనాలతో కుదేలు అవుతున్నారు. విత్తనాలు వేసినా అవి మొలకెత్తుతాయన్న ఆశ లేదు. కొందరు వ్యాపారుల వల్ల రైతులకు నష్టాలు తప్పడం లేదు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మారుమూల గ్రామాల రైతులను లక్ష్యంగా పెట్టుకుని నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నారు. జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాలో నిషేధిత పత్తి విత్తనాలు అమ్మే ముఠాలు తన కార్యకలాపాలు సాగిస్తున్నారు. విచ్చలవిడిగా నకిలీ విత్తనాలు గ్రామాల్లోకి ఇప్పటికే చేరాయని తెలిసింది. ఈ ముఠాలు చేతిలో పడి గ్రామీణ రైతులు మోసపోతున్నారు. ఏటా ఇదేతంతు జరుగుతున్నా ప్రారంభం దశలో అధికారుల నిఘా కొరవడుతుంది.

తనిఖీల్లో బయటపడుతున్న వైనం

నకిలీ విత్తనాలతో రైతులు నష్టపోతున్న తరుణంలో అధికారులు, పోలీసులు తనిఖీలు చేపట్టారు. దీంతో నకిలీ విత్తనాలు భారీ స్థాయిలో బయట పడుతున్నాయి.దుర్శెడ్ గ్రామం వద్ద కరీంనగర్ టాస్క్ ఫోర్స్, స్పెషల్ బ్రాంచ్, రూరల్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన వాహన తనిఖీల్లో గుంటూరు జిల్లా పత్తిపాడు మండలం కోయవారిపాలెం గ్రామానికి చెందిన, ప్రస్తుతం మంచిర్యాల జిల్లా వారం గ్రామంలో నివాసం ఉంటున్న చందు నాగేశ్వరరావు అనే వ్యక్తి నుండి పన్నెండు లక్షల రూపాయల విలువ చేసే 60 కేజీల నకిలీ పత్తి విత్తనాలను గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకుని నిందితుడిపై ఐపీసీ సెక్షన్ 420, 3(1) ఆఫ్ సీడ్స్ యాక్ట్, సెక్షన్ 8, 15(1) ఆఫ్ సీడ్స్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. అలాగే ఉమ్మడి జిల్లాల్లో విక్రయానికి సిద్ధంగా ఉంచిన రూ.15 లక్షల విలువైన 380 కిలోల నకిలీ పత్తి విత్తనాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గతేడాది 12 పీడీయాక్ట్ లు, 35 కేసులు నమోదు చేశామని అధికారులు చెబుతున్నారు.

గ్రామీణ రైతులే లక్ష్యంగా..

మారుమూల గ్రామాల రైతులను వ్యాపారులు లక్ష్యంగా పెట్టుకుని నకిలీ విత్తనాలు అంటగడుతున్నారు.

ప్రారంభ దశ నుంచి వ్యవసాయశాఖ నిఘా లేకపోవడంతో నకిలీ విత్తనాలను విచ్చలవిడిగా విక్రయిస్తున్నారనే ఆరోపణలున్నాయి. టాస్క్ ఫోర్స్ పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు ఏదో చేస్తామని చెప్పినా నకిలీ రాయుళ్ళ ఆగడాలు మాత్రం అంతులేకుండా పోతుంది.

మూలాలు గాలికొదిలేశారు

సీజన్‌లో ప్రతి ఏటా ఇదే తంతు జరుగుతుంది. నకిలీ విత్తనాలతో రైతులు బేజారవుతున్నారు. కొంత మంది రైతులు నష్టపోయారు. కేవలం ఎరువులు, సీడ్ దుకాణాల్లో మాత్రమే తనిఖీలు చేసి చేతులు దులుపుకుంటున్నారు. లాభాపేక్ష కోసం కొంత మంది నకిలీ విత్తనాలను విక్రయిసూ్త రైతులను మోసం చేస్తున్నారు. ఎవరికీ అనుమానం రాకుండా నకిలీ విత్తనాలను నిల్వ చేసి విక్రయిస్తున్నారు. అయితే ఈ నకిలీ విత్తనాలు బెజారు తగ్గించడానికి మూలాలు మాత్రం అధికారులు అన్వేషించడ లేదు.

ఏపీ నుంచి దిగుమతి..

ఆంధ్రప్రదేశ్ నుంచి ఇక్కడకు నకిలీ విత్తనాలు దిగుమతి అవుతున్నాయి. గుంటూరు, పల్నాడు, ప్రకాశం జిల్లాలకు చెందిన వారు కీలకపాత్ర పోషిస్తున్నట్లు అధికారుల విచారణలో తేలుతోంది. ఉమ్మడి జిల్లాలో పట్టుబడిన వ్యాపారులు ఆ మూడు జిల్లాలకు చెందిన వారిగా అధికారులు గుర్తించారు. వీరంతా గ్రామాల్లో కొందరికి డబ్బులు ఆశ చూపి నేరుగా రైతులకు నకిలీ విత్తనాలు అమ్ముతున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. గ్రామాల్లోకి నకిలీ విత్తనాలను ఆంధ్ర నుంచి భారీగా డంప్ చేస్తున్నట్లు తెలుస్తోంది.

విభిన్న రకాల కంపినీల విత్తనాలు వినియోగించాలి : కలెక్టర్

సాగు కోసం విభిన్న రకాల కంపెనీల పత్తి విత్తనాలను వినియోగించాలని, ఒకే రకంగా ఆధారపడితే నకిలీ బెడద ఎక్కువగా ఉంటుందని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. కరీంనగర్ లోని గాంధీ రోడ్ లో విత్తనాలు, పురుగుమందుల దుకాణాలను ఇటీవల తనిఖీ చేశారు. క్షుణ్ణంగా పరిశీలించారు. లైసెన్సులు కలిగిన వ్యాపారుల వద్దే విత్తనాలు, పురుగు మందులను కొనుగోలు చేయాలన్నారు. నకిలీ విత్తనాలను విక్రయిస్తే సహించేది లేదని, ఎవరైనా విక్రయించినా, సరఫరా చేసినా వారిపై పీడీ యాక్ట్ అమలు చేస్తామని హెచ్చరించారు.

# ప్రజా సమస్యలపై పోరాటాలకు సిద్ధం అవుతున్న జై స్వరాజ్ పార్టీ



హైదరాబాద్ జూన్ 10 (ఎక్స్ ప్రెస్ న్యూస్);తెలంగాణలో ప్రజా సమస్యలపై పోరాటాలకు జై స్వరాజ్ సిద్ధం అవుతోందని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు కాసాని శ్రీనివాసరావు గౌడ్ పేర్కొన్నారు. తెలంగాణ వచ్చి పదేండ్లు దాటిన ఇంకా మౌలిక సదుపాయాలైన విద్యా వైద్య ఉపాధి ప్రజలకు అందించే కార్యక్రమాలు ప్రభుత్వ చేపట్టలేదని ఆయన అన్నారు.

ఇన్నాళ్లు టీఆర్ఎన్ మాయమాటలతో కాలయాపన చేస్తే, పచ్చి అబద్దాలతో వచ్చే ఐదేళ్లు వెళ్లబుచ్చే పనిలో కాంగ్రెస్ పార్టీ ఉన్నట్లు కనిపిస్తోందని కేఎస్ఆర్ గౌడ్ వివరించారు. హైదరాబాద్లోని మెట్టుగూడ జై స్వరాజ్ పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు.రాష్ట్ర వ్యాప్తంగా పలు సమస్యల పరిష్కారానికి కొత్త ప్రభుత్వం ఇంకా చర్యలు చేపట్టలేదని, ఎన్నికలు, బడ్జెట్ తదితర కారణాలు చూపిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాలయాపన చేస్తూ ప్రజలను మభ్య పెడుతున్నారని కాసాని శ్రీనివాసరావు గౌడ్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరంతరం జనానికి తేటతెల్లం చేయడానికి త్వరలో ఒక కార్యాచరణ చేపడుతున్న ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఇటీవల లోక్ సభ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులను కేఎస్ఆర్ గౌడ్ శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జాతీయ అధికార ప్రతినిధి యామిని లక్ష్మి, పార్టీ జాతీయ కార్యదర్శి ఆర్ ఎస్ జే థామస్ , పార్టీ కార్మిక విభాగం అధ్యక్షుడు గోలుకొండ రత్నం, , తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరుషరాములు గౌడ్, రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ రామ్మూర్తి, రాష్ట్ర నాయకుడు సుగూరు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కుల సర్వే కసరత్తుకు నిపుణులతో- బీసీ కమిషన్ భేటీ

**-కార్యాచరణలో భాగంగా వివిధ రంగాల విషయ నిపుణులతో సుధీర్ఘ సమాలోచనలు**

**- విధి విధానాల ఖరారుకు మేధావుల అభిప్రాయాలు కోరిన బీసీ కమిషన్**



హైదరాబాద్ జూన్ 10 (ఎక్స్ ప్రెస్ న్యూస్); కుల సర్వే " కసరత్తు కు నిపుణులతో- బీసీ కమిషన్ సోమవారం భేటీ ఐనది.కార్యాచరణ లో భాగంగా వివిధ రంగాల విషయ నిపుణులతో సుధీర్ఘ సమాలోచనలు నిర్వహించింది.విధి విధానాల ఖరారుకు మేధావుల అభిప్రాయాలు కోరిన బీసీ కమిషన్రాష్ట్రం లో త్వరలో చేపట్టబోయే "సామాజిక , ఆర్థిక కుల సర్వే" (కుల గణన) కు సంబంధించి, తాము వెలిబుచ్చిన మౌఖిక అభిప్రాయాలను, లిఖిత పూర్వక ప్రతిపాదనలను పరిశీలించి, తగు విధంగా చర్యలు చేపట్టడానికి వీలుగా, ప్రభుత్వానికి నివేదిక అందచేయాలని పీపుల్స్ కమిటీ ఆన్ క్యాస్ట్ సెన్సస్ విషయ నిపుణులు, మేధావుల ప్రతినిధుల బృందం రాష్ట్ర బీసీ కమిషన్ ను కోరింది. సామాజిక,ఆర్థిక, రాజకీయ, విద్య, ఉద్యోగ రంగాలలో నిర్దిష్టంగా "కుల సర్వే" మొదలు పెట్టడానికి గానూ, పూర్తి స్థాయి "కార్యాచరణ ప్రణాళిక" ( ఞబితీనీని ఖశ్రీజీని) రూపొందించి ఇవ్వాలని, ప్రభుత్వం బీసీ కమిషన్ ను కోరింది. కాగా రాష్ట్రంలో ఇప్పటికే అధికారికంగా ాఅ,ాా,ఃఅ ఇతర అన్ని సామాజిక వర్గాలకు సంబంధించిన కులసర్వే చేయడానికి ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే.ఈ నేపధ్యం లోనే "కుల సర్వే" కు విధి విధానాల ఖరారు, ప్రశ్నావళి రూపకల్పన, అవలంభించాల్సిన పద్ధతులు మున్నగు అంశాలపై రాష్ట్ర బీసీ కమిషన్ పని మొదలు పెట్టింది.ఈ మేరకు రాష్ట్ర బీసీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావు, సభ్యులు సి. హెచ్ .ఉపేంద్ర, శుభ ప్రద్ పటేల్, కే. కిశోర్ గౌడ్, సభ్య కార్యదర్శి శ్రీమతి బి. బాల మాయ దేవి (ఐ.ఏ.ఎస్) లతో, పీపుల్స్ కమిటీ ప్రతినిధులు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ భేటీ ఖైరతాబాద్(హైదరాబాద్) రాష్ట్ర బీసీ కమిషన్ కార్యాలయం లో జరిగింది. ఈ సమాలోచనలలో జస్టిస్ చంద్ర కుమార్, ప్రొఫెసర్ మురళి మనోహర్, ప్రొఫెసర్ పి.ఎల్. విశ్వేశ్వర్ రావు , ప్రొఫెసర్ ఐ.తిరుమలి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి, ప్రొఫెసర్ సింహాద్రి, ప్రొఫెసర్ పద్మజాషా, ప్రొఫెసర్ నరేంద్ర బాబు, డాక్టర్ ఎస్ పృథ్వీ రాజ్ , దేవల్ల సమ్మయ్య , సతీష్ కొట్టే తదితరులతో కూడిన ప్రతినిధి బృందం మౌఖికం గా తమ అభిప్రాయాలను, సలహాలను, ఇచ్చింది. పలు ఆక్షేపణ లను వెలిబుచ్చింది. లిఖిత పూర్వకంగా పలు అధ్యయన పత్రాలను అందజేసింది. విషయ నిపుణులు, మేధావుల తో జరిగిన ఈ సమావేశం సుధీర్ఘంగా కొనసాగింది. ఈ సందర్భం గా తమిళనాడు, కర్ణాటక , ఆంధ్రప్రదేశ్, బీహార్ రాష్ట్రాల లో నిర్వహించిన "కుల సర్వే" లపై లోతుగా చర్చించారు. ఆయా రాష్ట్రాలలో సర్వే లు చేస్తున్నపుడు ఉత్పన్నమైన న్యాయపరమైన సమస్యలు, ప్రజల స్పందన, సాంకేతికంగా వివిధ అంశాలు, సాఫ్ట్ వేర్ ను రూపొందించడం, ఇలా ఒక్కొక్కటిగా కమిషన్ ఛైర్మన్ డాక్టర్ వకుళాభరణం... ఈ ప్రతినిధుల బృందం కు సాధికారికంగా వివరించారు.ఇప్పటికే బీసీ కమిషన్ దేశవ్యాప్తంగా సేకరించిన అధ్యయన వివరాలను వివిధపత్రాల రూపంలో అందచేశారు. మౌఖికంగా అనేక అంశాలను, సోదాహరణంగా ప్రతినిధుల బృందం కు వివరించారు. ఈ నేపధ్యం లో పీపుల్స్ కమిటీ తమ సంతృప్తి ని వ్యక్తం చేసింది. ప్రత్యేకంగా ఛైర్మన్ డాక్టర్ వకుళాభరణం ను అభినంధించింది. ఈ భేటీ ఫలవంతంగా జరిగిందని పీపుల్స్ కమిటీ తమ సంతోషాన్ని వ్యక్తం చేసింది.

రాష్ట్ర బీసీ కమిషన్ కొనసాగిస్తున్న "కుల సర్వే" ఆక్షన్ ప్లాన్ తయారీ లో భాగంగా, త్వరలో రాష్ట్రం లోని అన్ని వర్గాల, ప్రతినిధులు, మేధావులు, ప్రజా, కుల సంఘాలను ఆహ్వానిస్తామని ఛైర్మన్ కృష్ణమోహన్ రావు తెలిపారు. వారంలోపే తేదీలను ప్రకటిస్తామని పేర్కొన్నారు. అందరి అభిప్రాయాలు, సూచనలు, సలహాలు పరిగణలోకి తీసుకొని, నిర్మాణాత్మకంగా, హేతుబద్ధం గా ప్రభుత్వానికి నివేదించనున్నట్లు ఆయన వివరించారు.

# ఏరువాక ప్రారంభం కాబోతున్నది.. పెట్టుబడి సాయంపై నోరు మెదపరేం.. రేవంత్‌ను నిలదీసిన హరీశ్ రావు



మెదక్, జూన్ 10:పంట పెట్టుబడి సాయం రైతులకు తక్షణమే రేవంత్ రెడ్డి ప్రభుత్వం విడుదల చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు డిమాండ్ చేశారు. వానాకాలం వచ్చినా ప్రభుత్వం నుండి ఎలాంటి స్పందన లేదని మండిపడ్డారు. ఆదివారం నంగునూరు మండలం అక్కేనపల్లి గ్రామంలో ఆయిల్ ఫామ్ మొుట్ట మొదటి క్రాఫ్ కటింగ్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జూన్ 2021 లో నంగునూరు మండలం రామచంద్రపురం గ్రామంలో ఈ పంటను మొదటి సారి వేయడం జరిగిందని గుర్తు చేశారు. మూడేళ్ల క్రితం అయిల్ ఫామ్ సాగు ప్రారంభించామని, ఎల్లారెడ్డి పొలంలో మొదటి ఆయిల్ ఫామ్ మొక్క నాటామని, నాగేందర్ పొలంలో మొదటి పంట కోసుకుంటున్నామన్నారు.

ఆయిల్ ఫామ్ పంట అంటే చాల మంది రైతుల్లో అనుమానాలు ఉండేవని, ఖమ్మం సహా ఏపీలోని కొన్ని ప్రాంతాల్లో రైతులు ఎన్నో లాభాలు పొందుతున్నారని కొనియాడారు. తెలంగాణలో కూడా రైతులు లాభం పొందాలని ఇక్కడ ప్రారంభం చేశారని, ఆయిల్ పామ్ ప్రకృతి ప్రసాదించిన వరమని, రైతులు ఎదగడానికి దోహదపడుతుందని, ఇది చాలా సులువైన పంట కావడంతో స్థిరమైన ఆదాయం రావడంతో పాటు ఏడాది అంతా లాభమే వస్తుందన్నారు. కమ్మ కొట్టు, గెల కొట్టు, చెక్కు తెచ్చుకో అన్నట్టు ఉంటుందని, ఎకరాకు లక్షా 20 వేల ఆదాయం వరకు ఉంటుందని, ఆరుగాలం శ్రమించే రైతన్నకు లాభం చేయాలని కెసిఆర్ రాష్ట్రంలో 20 లక్షల ఎకరాల్లో ఆయిల్ ఫామ్ సాగు కోసం ప్రోత్సాహం అందించారని హరీష్ రావు చెప్పారు

అన్నిట్లో ప్రభుత్వం విఫలం

పంట బోనస్ బోగస్ అయ్యిందని, విత్తనాల కొరత లేకుండా చూడటంలో ప్రభుత్వ దృష్టి సారించలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయాన్ని చిన్న చూపు చూస్తున్నదని ధ్వజమెత్తారు. ఎరువులు కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, అన్ని రకాల పంటలకు రూ. 500 బోనస్ ఇవ్వాల్సిందేనని హరీష్ రావు డిమాండ్ చేశారు. బోనస్ విషయంలో మంత్రులు తలో మాట మాట్లాడటం, దొడ్డు వడ్లకే బోనస్ అని చెప్పడం మాట తప్పడమేనని ధ్వజమెత్తారు.అసెంబ్లీలో రైతుల పక్షాన బిఆర్ఎస్ పోరాటం చేస్తుందని, ఆయిల్ ఫామ్ దిగుమతిపై తొలగించిన సుంకాన్ని మళ్లీ విధించాలని, ఆయిల్ ఫామ్ రైతులకు ప్రోత్సాహం అందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కోరుతున్నామన్నారు.

# ఏఈవోల సస్పెన్షన్ ఎత్తివేయాలని తొర్రూరులో రైతుల ధర్నా

మహబూబాబాద్, జూన్ 10 మహబూబాబాద్' జిల్లా తొర్రూరు మండల పరిధిలోని పలువురు వ్యవసాయ విస్తరణాధికారుల (ఏఈవో)పై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తొర్రూరువ్యవసాయ శాఖ కార్యాలయం ముందు సోమవారం ధర్నానిర్వహించారు.

ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ జీలుగ విత్తనాల అవినీతి బాగోతం నుంచి తప్పించుకునేందుకు ఏవో సోమకుమార్, ఏడీఏ కలిసి ఏఈవోలు జమున, దీపిక, అరవింద్‌ను సస్పెండ్ చేయడంపై మండి పడ్డారు.

జీలుగ విత్తనాల దందాలో ఎటువంటి ప్రమేయం లేని ఏఈవోలను సస్పెండ్ చేయడం సిగ్గుచేటన్నారు. ఏవో కుమార్ జీలుగ విత్తనాలను పక రాష్ట్రాలకు అమ్ముకున్నారని, తనను తాను రక్షించుకునేందుకు ఏఈవోలను ఈ అవినీతిలోకి లాగాడన్నారు. విచారణ అధికారిగా వచ్చిన ఏడీఏ కూడా అవినీతిలో భాగమయ్యాడని, రైతులను విచారించలేదని, విక్రయ కేంద్రాల యజమానులు ఏఈవోల పాత్ర లేదని చెప్పిన నివేదికను సైతం తారుమారు చేశాడన్నారు.

తక్షణమే విజిలెన్స్ అధికారులచే నిష్పక్షపాత విచారణ జరిపించాలని, లేకుంటే భవిష్యత్ కార్యాచరణ ప్రకటించాల్సి వస్తుందని రైతులు హెచ్చరించారు.

కార్యక్రమంలో రైతులు మాలోత్ సురేశ్‌బాబు, ఐలయ్య, భూపతి, రాజేందర్, సైదానాయక్, సాయిరాం, రవి, పాప, నరసింహ, దేవేందర్, రాజబాబు, బీరియానాయక్, లాల్‌సింగ్, కిస్తు, పద్మ, కాళి, స్వాతి, పూలమ్మ, కమల, పిచ్చమ్మ, బుజమ్మ, విమల తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణికి వెల్లువెత్తిన ఫిర్యాదులు.

**-ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత మొదటి ప్రజావాణికి 48 ఫిర్యాదులు**

**-అమ్మ ఆదర్శ పాఠశాలల మరమత్తు పనులు వేగవంతం చేయాలి**

**-అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు శంకుస్థాపనలు వెంటనే చేపట్టాలి**

**-పెండింగ్ అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలి**

**-జిల్లా కలెక్టర్ క్రాంతివల్లూరు**



సంగారెడ్డి, జూన్ 10 :(నేటినిజం ప్రతినిధి):ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత సంగారెడ్డి కలెక్టరేట్లో నిర్వహించిన మొదటి ప్రజావాణికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. సోమవారం కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజావాణికి 48 ఫిర్యాదులు వచ్చాయి. కలెక్టర్ క్రాంతివల్లూరు , అదనపు కలెక్టర్ చంద్రశేఖర , డిఆర్ఓ పద్మజారాణి లు ప్రజావాణి దరఖాస్తులు స్వీకరించారు.

ప్రజావాణి కార్యక్రమానికి రెవెన్యూ శాఖ కి సంబంధించిన అర్జీలు 18, డి ఆర్ డి ఓ కు సంబంధించిన అర్జీలు 04, పంచాయతీరాజ్ శాఖ కు సంబంధించిన అర్జీలు 05,ఇతర శాఖలకు సంబంధి ంచినవి అర్జీలు 21 అందాయన్నారు . ప్రజావాణిలో మొత్తంగా 48 ఫిర్యాదులు వచ్చినట్లు జిల్లా కలెక్టర్ క్రాంతివల్లూరు తెలిపారు .పార్లమెంటు ఎన్నికల సందర్భంగా కోడ్ అమలులో ఉండడంతో తాత్కాలికంగా వాయిదా వేసిన ప్రజావాణిని సోమవారం నుంచి మళ్ళీ పునరుద్ధరింపజేశారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను వెంట వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న కారణంగా, జిల్లాలో ప్రారంభం కాని అభివృద్ధి పనులు, ఔఖీఉూ పనులు, పెండింగ్లో ఉన్న పనులను మొదలుపెట్టాలని ఆదేశించారు. ప్రారంభోత్సవాలు ఫౌండేషన్ స్టోన్లు సిద్ధం చేయాలని ఆదేశించారు .

అమ్మ ఆదర్శ పాఠశాల పనులను మండల ప్రత్యేక అధికారులు విధిగా తనిఖీలు చేయాలన్నారు. ఆదర్శ పాఠశాల పనులు ఫోటోలు తీసి పంపించాలని ప్రత్యేక అధికారులను ఆదేశించారు

తనిఖీలు నిర్వహించేటప్పుడు జరిగిన పనులు మిగిలి ఉన్న పనులు బడ్జెట్ వివరాలు సమర్పించాలన్నారు ఇంకా పనులు మిగిలి ఉంటే అమ్మ ఆదర్శ పాఠశాలలో టాయిలెట్స్, కాంపౌండ్ వాల్సు,కరెంటు వంటి అత్యవసరమైన పనులు గుర్తించి పూర్తి చేయాలన్నారు. ఈనెల 12న బడులు పునః ప్రారంభం అవుతున్నాయని ప్రారంభం రోజు నుండి విద్యార్థులు కొత్త యూనిఫామ్ లు కొత్త పుస్తకాలను విధిగా అందించాలన్నారు.ప్రతి గ్రామంలో స్కూలు ప్రారంభోత్సవం నాడు ప్రజాప్రతి నిధులు,అమ్మ ఆదర్శ పాఠశాల సభ్యులు, ఉపాధ్యాయులు , పాఠశా లలో కొత్తగా చేరే విద్యార్థులకు వినూత్న స్వాగత కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడకాన్ని ప్రభుత్వం నిషేధించినట్లు ఉత్తర్వులు జారీ చేసిందని, ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ప్రభుత్వ కార్యాల యాలలో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధి ంచినట్లు తెలిపారు. ప్రతి కార్యాల యంలో ప్లాస్టిక్ నిషేధ ఆజ్ఞలు పాటిం చే విధంగా చర్యలు తీసుకోవాలని హెచ్ఓడీలను ఆదేశించారు.

# ఆర్థిక లావాదేవీల వల్లే వ్యాపారి కిడ్నాప్

## -మిస్టరీని ఛేదించిన నార్సింగి పోలీసులు




హైదరాబాద్, జూన్ 10 : ఆర్థిక లావాదేవీల విషయంలో ఓ వ్యక్తిని కిడ్నాప్ చేసేందుకు యత్నించిన ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఆదివారం నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ రమణ గౌడ్ వివరాలను వెల్లడించారు. కర్నూలుకు చెందిన శేషు వర్ధన్‌రెడ్డి (37) తన కుటుంబ సభ్యులతో కలిసి హైదర్షాకోట్‌లోని ఫోర్ట్ వ్యూ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్నాడు. అతడు గోల్డ్, ఎలక్ట్రానిక్ వ్యాపారాలు చేస్తున్నాడు. అయితే, ఆర్థిక లావాదేవీల విషయంలో కర్నూల్‌కు చెందిన అందే క్రాంతికుమార్(36)తో విబేధాలు ఉన్నాయి. శేషు వర్ధన్‌రెడ్డి నుంచి క్రాంతికుమార్‌కు డబ్బులు రావాల్సి ఉంది. డబ్బులు అడిగిన ప్రతిసారి రేపుమాపు అంటూ దాట వేస్తున్నాడు. ఎన్ని రోజులైనా తనకు డబ్బులు ఇవ్వడని కక్ష పెంచుకున్న క్రాంతికుమార్.. ఎలాగైనా డబ్బులు వసూలు చేయాలని నిర్ణయించుకున్నాడు. కిడ్నాప్ చేసి.. బెదిరించి డబ్బులు తీసుకోవాలని తన స్నేహితుడైన కె. సందీప్ (36)కు విషయాన్ని తెలిపి సహాయం కోరాడు.

ఈ నెల 8న రాత్రి నార్సింగి రోటరీ వద్ద శేషు వర్ధన్‌రెడ్డి తన వ్యాపార భాగస్వామి కారులో ప్రయాణిస్తున్నాడు. అప్పటికే కిడ్నాప్ చేసేందుకు మాటు వేసి ఉన్న క్రాంతికుమార్, సందీప్ కలిసి కారులో వేచి ఉన్నారు. శేషు వర్ధన్‌రెడ్డి రాగానే.. కారులోకి వెళ్లి పిడిగుద్దులు గుద్ది.. దాడి చేశారు. అలాగే, నిందితులు తమ కారులోకి ఎక్కించుకొని వెళ్లిపోయారు. ఈ ఘటనను స్థానికులు గమనించి 100 నంబర్‌కు ఫోన్‌చేసి సమాచారం అందించారన్నారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. వివరాలు సేకరించారు. శేషు వర్ధన్‌రెడ్డిని నిందితులు కర్నూలు వైపు తీసుకువెళ్తున్నారని స్థానికంగా ఉన్న సీసీ కెమెరాల సహాయంతో గుర్తించిన పోలీసులు, ఆ మార్గంలో ఉన్న అన్ని పోలీసు స్టేషన్‌లను అప్రమత్తం చేశారు. మహబూబ్‌నగర్ పరిధిలోని అడ్డాకుల టోల్ గేట్ వద్ద అడ్డాకుల పోలీసులు నిందితుల కారును పట్టుకుని విచారించారు. నిందితులపై కేసు నమోదు చేసి, అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

# తలసాని ఇంట విషాదం- సోదరుడు శంకర్ యాదవ్ కన్నుమూత

హైదరాబాద్, జూన్ 10 :మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఇంట తీవ్ర విషాదం చోటు చేసుకుంది. మోండా మార్కెట్ వ్యాపారుల సంఘం అధ్యక్షుడు , తలసాని సోదరుడు తలసాని శంకర్ యాదవ్ మృతి చెందారు.

గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న శంకర్ యాదవ్ ఇవాళ మరణించారు. సికింద్రాబాద్ లోని యశోద హాస్పిటల్ లో చికిత్స పొందుతూ ఇవాళ తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. గతంలో బోయిన్ పల్లి మార్కెట్ అధ్యక్షుడిగా కూడా తలసాని శంకర్ యాదవ్ పని చేశారు. .

# సిక్కిం ముఖ్యమంత్రిగా ప్రేమ్‌సింగ్ తమాంగ్ ప్రమాణస్వీకారం



న్యూఢిల్లీ, జూన్ 10 : సిక్కిం ముఖ్యమంత్రిగా 'సిక్కిం క్రాంతికారి మోర్చా (ాఐఓ)' అధ్యక్షుడు ప్రేమ్‌సింగ్ తమాంగ్ (ఖతీవఎ ాతినిఙప్త్ర ుజీఎజీనిఙ) ప్రమాణస్వీకారం చేశారు. సిక్కిం గవర్నర్ లక్ష్మణ్ ఆచార్య (ఒజీసబఎజీని ంఞప్త్రజీతీఎజీ) ఆయన చేత ప్రమాణస్వీకారం చేయించారు. గ్యాంగ్‌టక్‌లోని పల్జోర్ స్టేడియంలో తమాంగ్ ప్రమాణస్వీకార కార్యక్రమం జరిగింది. ఆయనతోపాటు ఎస్‌కేఎం ఎమ్మెల్యేలు సోనమ్ లామా, అరుణ్‌కుమార్ ఉప్రేతి క్యాబినెట్ మంత్రులుగా ప్రమాణం చేశారు.

కాగా, సిక్కిం అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 32 స్థానాలకుగాను 31 స్థానాల్లో అధికార ఎస్కేఎం ఘన విజయం సాధించింది. 2019కి ముందు ఏకంగా 25 ఏండ్లపాటు రాష్ట్రాన్ని ఏలిన ప్రతిపక్ష 'సిక్కిం డెమోక్రటిక్ ఫ్రంట్ (ాఆఈ)' కేవలం ఒక్క స్థానానికే పరిమితమైంది. కాగా ప్రేమ్‌సింగ్ తమాంగ్ సిక్కిం ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకోవడం ఇది వరుసగా రెండోసారి. 2019 నుంచి 2024 వరకు ఆయనే ముఖ్యమంత్రిగా ఉన్నారు.తమాంగ్ ప్రమాణస్వీకార కార్యక్రమానికి 30 వేల మందికి ఆహ్వానించారు. ప్రమాణస్వీకారానికి కొన్ని నిమిషాల ముందు కార్యక్రమానికి విచ్చేసిన వారికి తమాంగ్ అభివాదం చేశారు. ఈ సందంర్భంగా పటాసులు కాల్చి అభిమానులు సంబురాలు చేసుకున్నారు. కాగా మరోసారి సిక్కిం ప్రభుత్వ పగ్గాలు చేపట్టిన 56 ఏండ్ల ప్రేమ్ సింగ్ తమాంగ్ రాష్ట్ర ప్రజల నుంచి మంచి ఆదరణ పొందారు.తమాంగ్ రాజకీయాల్లోకి రాకముందు మూడేండ్లు ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేశారు. సిక్కిం డెమోక్రటిక్ ఫ్రంట్ నుంచే తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. 1994 నుంచి 2009 వరకు ఆయన మంత్రిగా పనిచేశారు. ఎస్‌డీఎఫ్‌లో ఆయన చామ్లింగ్‌కు శిష్యుడిగా కొనసాగారు. 2009 తర్వాత ఆయనకు పవన్ కుమార్ చామ్లింగ్‌తో విభేదాలు మొదలయ్యాయి.

దాంతో ఎన్‌డీఎఫ్ నుంచి బయటకు వచ్చి 2013లో సొంతంగా ఎస్‌కేఎం పార్టీని స్థాపించారు. 2019 ఎన్నికల్లో 17 సీట్లు సాధించి 25 ఏండ్ల ఎస్‌డీఎఫ్ పాలనకు ముగింపు పలికారు. ఈ ఎన్నికల్లో ఏకంగా 31 స్థానాలు గెలుచుకుని ప్రతిపక్ష ఎస్‌డీఎఫ్‌కు ఘోర పరాభవం రుచి చూపించారు. ఇదిలావుంటే సిక్కింలో జాతీయ పార్టీలు బీజేపీ, కాంగ్రెస్ పూర్తిగా తుడిచిపెట్టుకుపోయాయి. ఆ పార్టీలకు ఈ ఎన్నికల్లో 20 వేల ఓట్లు కూడా రాలేదు.

# అవయవదానం.. ఎందరికో ప్రాణదానం




హైదరాబాద్, జూన్ 10 : అవయవదానంపై ఆదివారం నెక్లెస్‌రోడ్‌లో అవగాహన పరుగు నిర్వహించారు. సంజీవయ్య పార్కు నుంచి 10కే, 5కే రన్ సాగింది. మోహన్ ఫౌండేషన్ సీనియర్ ట్రాన్స్‌ప్లాంట్ కో ఆర్డినేటర్ డాక్టర్ భానుచంద్ర, బ్రిల్స్ సీఈవో రామ్‌నరేశ్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. తెలంగాణ 10కే రన్ రెండో ఎడిషన్ పేరిట రన్ ఫర్ ఆర్గాన్ అవేర్నెస్ పరుగులో పలువురు రన్నర్స్,

వైద్యులు, యువతీయువకులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. మరణించినా..అవయవదానం ద్వారా మరొకరికి జీవితాన్ని ఇచ్చి ఎంతోమంది ప్రాణాలు నిలుపవచ్చని పలువురు పేర్కొన్నారు. ప్రజల్లో అవయవదానంపై అవగాహన పెంచడంతో పాటు కొందరిలో ఉన్న అపోహలను పోగొట్టేందుకు ఈ అవగాహన రన్ నిర్వహించినట్లు నిర్వాహకులు వెల్లడించారు.

# ట్రాక్టర్ అమ్మి మరీ టికెట్ కొన్నాడు.. అయినా అతనికి మిగిలింది నిరుత్సాహమే

న్యూయార్క్,జూన్ 10 : ఐసీసీ టోర్నీల్లో వేదిక ఏదైనా పాక్‌పై (ఖజీనితిబబిజీని) తమదే పైచేయి అని టీమ్‌ఇండియా (ఎవజీఎ ఎనిటజీతి) మరోసారి నిరూపించింది. టీ20 వరల్డ్‌కప్‌లో భాగంగా న్యూయార్క్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో దాయాది జట్టుపై భారత్ ఘన విజయం సాధించింది. ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగిన పొట్టి పోరులో తక్కువ స్కోరుకే పరిమితమైనప్పటికీ పాక్‌పై గెలిచిన రోహిత్ సేన మువ్వెన్నెల పతాకాన్ని సగర్వంగా రెపరెపలాడించింది. అయితే దాయాదుల మధ్య సమరం అంటే అభిమానుల్లో ఆసక్తి అంతాఇంతా కాదు. తమ జట్టే గెలవాలని ఇరుదేశాల అభిమానులు కోరుకుంటారు. ప్రత్యక్షంగా మ్యాచ్‌ను చూసి ఆస్వాధించాలని భావిస్తారు. అచ్చం ఇలాగే పాకిస్థాన్ ఫ్యాన్ (ఖజీనితిబబిజీని ఈజీని) ఒకరు తనకు జీవనాధారమైన ట్రాక్టర్‌ను అమ్ముకుని వచ్చిన ఆ డబ్బుతో భారత్‌-పాక్ మ్యాచ్ టికెట్ కొన్నాడు. అయితే చివరికి అతనికి నిరాశే మిగిలింది.

మ్యాచ్ ఫలితం చూసిన తర్వాత తాను నిరుత్సాహానికి గురయ్యానని పాక్ అభిమాని చెప్పాడు. 3 వేల డాలర్లు పెట్టి మ్యాచ్ టికెట్ కొనడానికి తన ట్రాక్టర్‌ను విక్రయించానని చెప్పాడు. భారత్ స్కోరు చూసినప్పుడు ఈ మ్యాచ్‌లో ఓడిపోతామని అనుకోలేదు. అది ఛేదించదగిన లక్ష్యమనే భావించాం. గేమ్ మొత్తం మాచేతుల్లోనే ఉంది. అయితే బాబర్ ఆజం ఔట్ అయిన తర్వాత పాక్ అభిమానులు నిరుత్సాహపడ్డారని చెప్పాడు. చివరి వరకూ పోరాడి మ్యాచ్‌ను నిలబెట్టుకున్న భారత జట్టును అభినందించాడు.

టీ20లలో బ్యాటర్ల రొడ్డకొట్టుడు బాదుడు కంటే 'లో స్కోరింగ్ థ్రిల్లర్'లో ఉండే మజాను భారత్-పాక్ మ్యాచ్ మరోసారి అందించింది. చివరి బంతి దాకా ఇరు జట్ల మధ్య నువ్వా నేనా అంటూ దోబూచులాడిన విజయం ఆఖరికి భారత్‌ను వరించింది. ఆదివారం న్యూయార్క్ లోని నసావు స్టేడియం వేదికగా పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో రోహిత్ సేన 6 వికెట్ల తేడాతో అత్యద్భుత విజయం అందుకుంది. పాక్ చతుర్ధయం నసీమ్ షా (3/21), హరీస్ రవూఫ్ (3/21), మహ్మద్ అమిర్ (2/23), షహీన్ అఫ్రిది (1/29) నిప్పులు చెరగడంతో టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన భారత్.. 19 ఓవర్లలో 119 పరుగులకే ఆలౌట్ అయింది. రిషభ్ పంత్ (31 బంతుల్లో 42, 6 ఫోర్లు) టాప్ స్కోరర్ కాగా అక్షర్ పటేల్ (20) గుడ్డిలో మెల్లలా ఫర్వాలేదనిపించాడు. భారత బ్యాటర్లలో కోహ్లితో సహా ఏకంగా ఎనిమిది మంది 'సింగిల్ డిజిట్'కే పరిమితమయ్యారు. బ్యాటర్లు విఫలమైనా బౌలర్లు సమిష్టిగా రాణించడంతో పాకిస్థాన్.. నిర్ణీత 20 ఓవర్లలో 113/7కే పరిమితమైంది. రిజ్వాన్ (44 బంతుల్లో 31, 1 ఫోర్, 1 సిక్సర్) రాణించినా మిగిలిన బ్యాటర్లు ఒత్తిడికి చిత్తయ్యారు. భారత విజయంలో కీలక పాత్ర పోషించిన బుమ్రా (3/14)కే 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది.

# ఆదివాసీలు సంచరించే ప్రదేశాల్లో అమర్చిన బూబీ ట్రాప్స్ ను స్వాదీనం చేసుకున్న పోలీసులు



భద్రాద్రికొత్తగూడెం, జూన్ 10 (నేటినిజం ప్రతినిధి) :తెలంగాణ-చత్తీస్గడ్ రాష్ట్రాల సరిహద్దు ఏజెన్సీ ప్రాంతాల్లో భద్రతా బలగాలను హతమార్చడమే లక్ష్యంగా చేసుకుని ఆదివాసీలు సంచరించే ప్రదేశాల్లో అమర్చిన బూబీ ట్రాప్స్ ను స్వాదీనం చేసుకున్న పోలీసులు చర్ల మండలంలోని పూసుగుప్ప అటవీ ప్రాంతం మరియు తెలంగాణ-చత్తీస్గడ్ రాష్ట్రాల సరిహద్దుగా గల ప్రాంతాలలో చర్ల పోలీసుల ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం స్పెషల్ పార్టీ,చత్తీస్ఘడ్ పోలీసులు మరియు సిఆర్పిఎఫ్ పోలీసులు సోమవారం సంయుక్తంగా నిర్వహించిన ఏరియా డామినేషన్ ఆపరేషన్లో పోలీసులను హతమార్చడమే లక్ష్యంగా చేసుకొని నిషేధిత సిపిఐ మావోయిస్టులు సరిహద్దు ప్రాంతాల్లోని ఆదివాసీలు, వారికి సంభందించిన జంతువులు సంచరించే ప్రదేశాలలో అమర్చిన 70 బూబీ ట్రాప్స్ ను గుర్తించారు. మావోయిస్టులు గుంతలు త్రవ్వి ఏర్పాటు చేసిన 70 బూబీ ట్రాప్స్ నుంచి 4396 పదునైన ఇనుప కడ్డీలను తొలగించి వాటిని స్వాదీనం చేసుకున్నారు. నిషేధిత సిపిఐ మావోయిస్ట పార్టీ నాయకులు ఆదివాసీలకు మంచి చేస్తున్నామని చెబుతూ వారి ప్రాణాలకు ముప్పు వాటిల్లిలా ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడటం దురదృష్టకరమని అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ టి.సాయి మనోహర్, భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ ఐపిఎస్ సోమవారం సంయుక్తంగా ఒక ప్రకటనను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...తెలంగాణ-ఛత్తీస్గడ్ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో నివసించే అమాయకపు ఆదీవాసీ ప్రజలు మావోయిస్టుల దుశ్చర్యల వలన నిత్యం బిక్కు బిక్కు మంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఆదివాసీలు, జంతువులు సంచరించే ప్రాంతాలలో వారు అమర్చిన ఐఈడ్స్, బూబీ ట్రాప్స్ వలన ఇప్పటికే చాలామంది ప్రాణాలను కోల్పోవడం, తీవ్రంగా గాయాలపాలవ్వడం జరుగుతుందని అన్నారు. కావున సరిహద్దు ప్రాంతాల్లో నివసించే ఆదివాసి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇటీవల ములుగు జిల్లా వెంకటాపురం ఏరియాలోని జగన్నాధపురం గ్రామానికి చెందిన యేసు అనే వ్యక్తి మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి మరణించడం కూడా జరిగిందని తెలిపారు. ఆదివాసిల కోసమే మా పోరాటం అంటూ నీతులు వల్లించే మావోయిస్టు నాయకులు వ్యవసాయ రీత్యా,అటవీ ఉత్పత్తుల సేకరణలో భాగంగా సంచరించే ఆదివాసీలకు తీవ్ర నష్టం కలిగేలా చేస్తున్నారన్నారు. సరిహద్దు ప్రాంతాల్లో నివసించే ఆదివాసి ప్రజలకు జరిగే నష్టానికి పూర్తి బాధ్యత మావోయిస్టు పార్టీ వహించాలని అన్నారు. తెలంగాణ-ఛత్తీస్గడ్ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో నివసించే ఆదివాసి ప్రజల సంక్షేమం,అభివృద్ధి కొరకు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ సారథ్యంలో జిల్లా పోలీసులు ఎల్లప్పుడూ ముందుంటారని తెలియజేసారు. అభివృద్ధి నిరోధకులుగా మారిన నిషేధిత మావోయిస్టులకు ఎవ్వరూ సహకరించవద్దని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

# ద్విచక్ర వాహనాలు దొంగతనం చేసిన నిందితులు అరెస్ట్

హైదరాబాద్, జూన్ 10 :జల్సాలకు అలవాటు పడి దిచక్ర వాహనాలను దొంగతనం చేస్తూ పట్టుబడ్డ నిందితులను బోయిన్‌పల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం బోయిన్‌పల్లి (ఃనీతినిజూజీశ్రీశ్రీఎ) పోలీస్ స్టేషన్ లో నార్త్ జోన్ డీసీపీ రోహిణి ప్రియ దర్శిని విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. రజాక్ ఖాన్(38) యోహాను(30),జి.వెంకటప్పయ్య(28) ముగ్గురు స్నేహితులు కలిసి గత కొంత కాలంగా చోరీలకు పాల్పడుతున్నారు. నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో పార్కింగ్ చేసి ఉన్న 14 ద్విచక్ర వాహనాలను దొంగలించి, నకిలీ రిజిస్ట్రేషన్లు చేసి ఓఎల్ఎక్స్ యాప్ ద్వారా విక్రయిస్తున్నారు.

నిందితుల నుంచి రూ. 8లక్షల విలువైన ద్విచక్రవాహనాలు, ల్యాప్‌టాప్ స్వాధీనం చేసుకున్నారు. ఇందులో 4 వాహనాలను ఓఎల్ఎక్స్‌లో నకిలీ రిజిస్ట్రేషన్లు చేసి విక్రయించినట్లు పోలీసుల విచారణలో తేలింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. ఈ సమావేశంలోఅదనపు డీసీపీ అశోక్, ఏసీపీ గోపాల కృష్ణమూర్తి, డీఐ సర్దార్ నాయక్, తుల్జీరామ్, శివ శంకర్, రమేష్, మురళి, మహేష్, శివ కుమార్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

# డాక్టర్ల నిర్లక్ష్యంతో బాలిక మృతి? సూర్యాపేట ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ వద్ద ఉద్రికత్త




సూర్యాపేట, జూన్ 10 :సూర్యాపేట ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ వద్ద ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. వైద్యుల నిర్లక్ష్యంతో తమ కుమార్తె హారిస్మిత(17) మృతి చెందిందని ఆరోపిస్తూ సదరు డాక్టర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని బాలిక తల్లిదండ్రులు, బంధువులు జనరల్ హాస్పిటల్ ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన రత్నావత్ సైదులు, రమ్యల కుమార్తె హారిస్మిత(17) ట్రాన్సిల్స్‌తో బాధపడుతూ సూర్యాపేట ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌కు మే 20న వచ్చింది.పరిశీలించిన సదరు డాక్టర్లు ఆపరేషన్ అవసరమని గుర్తించి ఆపరేషన్‌కు సంబంధించిన పరీక్షలను చేశారు. అనంతరం ఆపరేషన్ థియేటర్లోకి ఉదయం తొమ్మిది గంటల సమయంలో తీసుకువెళ్లారు. మధ్యాహ్నం అవుతున్నా తమ కుమార్తె ఆపరేషన్ థియేటర్ నుంచి బయటకు రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు హెచ్‌ఓడీని కలిశారు.

అనస్థీషియా వేయడంతో యువతి అపస్మారక స్థితికి వెళ్లిందని, ఇక్కడ వైద్య సదుపాయాలు లేవని హైదరాబాద్‌లోని గాంధీ హాస్పిటల్‌కు పంపించారు. అక్కడ రెండు రోజులు వైద్యం అందించినప్పటికీ యువతి ఈ నెల 4న మృతి చెందింది. దీంతో సదరు వైద్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి యువతి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆందోళ చేపట్టారు.

# నీళ్ల ట్యాంకర్‌ను ఢీ కొట్టిన లారీ.. కార్మికుడి మృతి, హైవేపై భారీగా ట్రాఫిక్ జాం

ఆదిలాబాద్, జూన్ 10 : ఆదిలాబాద్‌జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. హైవే రోడ్డుపక్కన చెట్లకు నీళ్లు పోస్తున్న కార్మికుడిని లారీ ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ విషాదకర సంఘటన ఆదిలాబాద్ జిల్లా దూద్‌గండి వద్ద చోటు చేసుకుంది. రోడ్డు ప్రమాదంలో చనిపోయిన కార్మికుడి కుటుంబానికి న్యాయం చేయాలని మృతుడి బంధువులు జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టారు. దీంతో మూడు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ప్రమాదకర స్టంట్స్‌తో యువత బంగారు భవిష్యత్ నాశనం.. సజ్జనార్ ట్వీట్

హైదరాబాద్, జూన్ 10 :ఇప్పుడు ప్రపంచమంతా సోషల్ మీడియాలో మునిగి తేలుతోంది. రాత్రికి రాత్రే సెలబ్రిటీగా మారాలన్న లక్ష్యంతో యువత ఎన్నో వినూత్న ప్రయోగాలకు పాల్పడుతున్నారు. అలా కొన్ని ప్రయోగాలు బెడిసికొడుతున్నాయి. కొన్నేమో రాత్రికి రాత్రే సెలబ్రిటీలను చేస్తున్నాయి. ఇదంతా ఒకరిని చూసి మరొకరు తమకు నచ్చిన రీతిలో వినూత్న ప్రయోగాలు చేస్తున్నాయి. అయితే ఓ బాలుడు కూడా అతి వేగంగా బైక్ నడిపి, ప్రాణాల మీదకు తెచ్చుకున్నాడు. అందుకు సంబంధించిన వీడియోను టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ తన ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు.

# భర్తను హత్య చేసిన భార్య.. మరో వ్యక్తితో సంబంధం కారణమన్న పోలీసులు

జైపూర్, జూన్ 10 : భర్తను భార్య హత్య చేసింది. దొంగలు దోపిడీకి పాల్పడి అతడ్ని హత్య చేసినట్లు నమ్మించేందుకు ప్రయత్నించింది. అయితే మరో వ్యక్తితో వివాహేతర సంబంధం నేపథ్యంలో భర్తను ఆమె చంపినట్లు దర్యాప్తులో పోలీసులు తెలుసుకున్నారు.

చివరకు ఆ మహిళను అరెస్ట్ చేశారు. రాజస్థాన్‌లోని బుండి జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఆదివారం తెల్లవారుజామున కత్తిపోటు గాయాలు, రక్తం మరకలతో కూడిన 35 ఏళ్ల వ్యక్తి మృతదేహాన్ని అతడి ఇంట్లో పోలీసులు గుర్తించారు. ఆ ఇంట్లో వస్తువులన్నీ చెల్లాచెదురుగా పడి ఉన్నాయి.

ఇంట్లోకి దొంగలు ప్రవేశించారని, తన భర్తపై కత్తితో దాడి చేసి అతడి చెవికి ఉన్న రింగులను చోరీ చేశారని భార్య అయిన 32 ఏళ్ల మమత పోలీసులకు చెప్పింది. దొంగల దాడిలో భర్త చనిపోయినట్లుగా నమ్మించేందుకు ఆమె ప్రయత్నించింది.

కాగా, పోస్ట్‌మార్టం తర్వాత మృతదేహాన్ని కుటుంబానికి అప్పగించారు.

గుర్తు తెలియని వ్యక్తులపై హత్య కేసు నమోదు చేశారు. అయితే మృతుడి భార్య మమతను పోలీసులు అనుమానించారు.

సమీప గ్రామంలోని మరో వ్యక్తితో ఆమెకు వివాహేతర సంబంధం ఉన్నట్లు దర్యాప్తులో తెలుసుకున్నారు.ఈ విషయంపై భార్యాభర్తల మధ్య తరుచుగా గొడవలు జరుగుతున్నట్లు గ్రహించారు. కొన్ని ఆధారాలతో ఆమెను గట్టిగా ప్రశ్నించారు. దీంతో భర్తను తానే చంపినట్లు భార్య ఒప్పుకుంది. ఈ నేపథ్యంలో మమతను పోలీసులు అరెస్ట్ చేశారు.

భాషా సాంస్కృతికశాఖ, తెలంగాణ ప్రభుత్వం సౌజన్యంతో
అమరవాది ఫౌండేషన్
సాహిత్య, సాంస్కృతిక సంస్థ నిర్వహణలో
శ్రీమతి అమరవాది హైమవతీ-డా.ఎ.సి.ఎం.ఎల్. ప్రసాద్ సాహిత్య పురస్కారం
పురస్కార గ్రహీత : ఆచార్య సి. మృణాళిని
డా.ఎ.సి.ఎం.ఎల్. ప్రసాద్-శ్రీమతి హైమవతి బాల సాహిత్య పురస్కారం
పురస్కార గ్రహీత : శ్రీ గరిపెల్లి అశోక్
డా. అమరవాది నీరజ
బాలల కథలు 'ఏడు రంగుల జండా' పుస్తకావిష్కరణ
13 జూన్, 2024 గురువారం, సాయంత్రం 6 గంటలకు,
సమావేశ మందిరం, మొదటి అంతస్తు, రవీంద్ర భారతి, హైదరాబాద్
ముఖ్య అతిథి
శ్రీ మణికొండ వేదకుమార్
సంపాదకులు, బాలచెలిమి బాల వికాస పత్రిక & దక్కన్ లాండ్
చైర్మన్, చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమి
అధ్యక్షులు
డా. పత్తిపాక మోహన్
దక్షిణ ప్రాంత అధికారి, నేషనల్ బుక్ ట్రస్ట్, భారత ప్రభుత్వం
విశిష్ట అతిథులు
డా. జుర్రు చెన్నయ్య
కార్యదర్శి, తెలంగాణ సారస్వత పరిషత్తు
శ్రీ చొక్కాపు వెంకటరమణ
సాహిత్య అకాడమి బాల సాహిత్య పురస్కార గ్రహీత
అమరవాది ఫౌండేషన్ పక్షాన
డా. అమరవాది నీరజ (అధ్యక్షులు) | ఎ. సీతారాం (ఉపాధ్యక్షులు) | చింతకింది మాల్యా (ప్రధాన కార్యదర్శి) | డా. హారిక చెరుకుపల్లి (నిర్వాహక కార్యదర్శి)

# గోరక్షకుల ముసుగులో చట్టాన్ని అతిక్రమించే వారిపై చర్యలు తీసుకోండి..

## ఏసీపీ నరేందర్ కు.. ఎంఐఎం నగర అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్..కార్పొరేటర్ల వినతి



కరీంనగర్, జూన్ 10 : (నేటినిజం ప్రతినిధి) గోరక్షకుల ముసుగులో చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని, కావాలని దాష్టీకాన్ని ప్రదర్శించే వారిపై.. చర్యలు తీసుకోవాలని.. ఈదుల్ అజ్హా బక్రీద్ పండుగ నిర్వహణకై సహకరించాలని, ఎంఐఎం నగర అధ్యక్షుడు, తెలంగాణ హజ్ కమిటీ సభ్యులు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్.. ఎంఐఎం కార్పొరేటర్లు, నాయకులు సోమవారం ఎంఐఎం అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాల మేరకు కరీంనగర్ ఏసీపీ గోపతి నరేందర్ ను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ బక్రీద్ లో ఖుర్బానీ ఇచ్చే జంతువుల్లో ఆవులు, చిన్న దూడలు, జింకల వంటివి లేకుండా జాగ్రత్తలు వహించాలని.. ఆరోగ్య కరమైన జంతువులు ఉండేట్లు, ఖచ్చితంగా పశువుల డాక్టర్ ధ్రువీకరించిన సర్టిఫికెట్ ఉండేట్లు చూసుకోవాలని, చట్ట పరిధిలో ఉంటూ పండుగ జరుపుకోవాలని, చట్టాన్ని అతిక్రమించే పనులు చేయొద్దని, శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ముస్లిం సమాజానికి పిలుపునిచ్చారు. జంతువులు రవాణా చేస్తున్నప్పుడు పోలీసులు ఆపితే వారికి సహకరించాలని, గోరక్షకుల ముసుగులో దుండగులు ఆపినచో తక్షణమే 100కు కాల్ చేయాలని, సమీపంలో ఉన్న పోలీసు స్టేషన్ కు సమాచారం అందించాలని కోరారు. గోరక్షకుల ముసుగులో చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే అల్లరి మూకలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏసీపీ కు విజ్ఞప్తి చేశారు. ముస్లింల పరంగా తాము ప్రభుత్వానికి, పోలీసులకు ఎల్లవేళలా సహకారం అందిస్తామని వినతిపత్రం లో పేర్కొన్నారు.

కానీ గోరక్షకుల ముసుగులో చట్టాన్ని చేతుల్లో తీసుకొని సోషల్ మీడియాలో అభూత కల్పనలు కల్పితాలు సృష్టించి, గొడవలకు కారణమయ్యే వారిపై, ప్రశాంతమైన వాతావరణాన్ని చెడగొట్టే మూకల కదలికలపై నిఘా పెట్టి, నియంత్రించాలని, గోరక్షకుల ముసుగులో అనవసరంగా రాద్ధాంతం చేస్తే వారికి తమ వైపు నుండి గట్టి గుణపాఠం చెబుదామని హెచ్చరించారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమి, ఎంఐఎం ప్రధాన కార్యదర్శి బర్కత్ అలీ, సహాయ కార్యదర్శి ఆతిన, ఖమరొద్దీన్, ఇబ్రహీం, కార్పొరేటర్లు అఖీల్ ఫిరోజ్, శర్ఫుద్దీన్, నాయకులు అలిబాబా, అజర్ దబీర్, సాజిద్, మజహరొద్దీన్, ఖాలీద్, తదితరులు పాల్గొన్నారు.

# పైప్‌లైన్ నిర్మాణం కోసం రూ.40 కోట్లు మంజూరు చేయండి : సుధీర్‌రెడ్డి

హైదరాబాద్, జూన్ 10 :: ఎల్బీనగర్ నియోజకవర్గంలోని శివారు కాలనీల మంచినీటి పైప్‌లైన్ నిర్మాణం కోసం అదనంగా రూ. 40 కోట్ల నిధులను మంజూరు చేయాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కోరారు. సోమవారం జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డిని ఎమ్మెల్యే కలిసి నియోజకవర్గంలోని డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలోని పలు డ్రైనేజీ, మంచినీటి సమస్యలను జలమండలి ఎండీ దృష్టికి తెచ్చామన్నారు.

ప్రధానంగా గతంలో దాదాపు 80 కిలోమీటర్ల మేర నూతన వాటర్ లైన్లతో పాటుగా సుమారు రూ. 50 కోట్లతో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థకు నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించామన్నారు. తాజాగా భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ కోసం అదనంగా మరో రూ. 20 కోట్లు మంజూరు చేశామన్నారు. గతంలో తాము ప్రతిపాదించిన మరో 18 కిలోమీటర్ల మేర నూతన వాటర్ లైన్లు వేసేందుకు అదనంగా మరో రూ. 40 కోట్లను మంజూరు చేయాలని జలమండలి ఎండీని కోరినట్లు ఆయన తెలిపారు.

# బక్రీద్ పండుగ ఏర్పాట్లను ఘనంగా చేయాలి

## -అదనపు కలెక్టర్ కు, మేయర్ సునీల్ రావుకు, మున్సిపల్ అదనపు కమిషనర్ కు ఎంఐఎం నేతల వినతి



కరీంనగర్, జూన్ 10 : (నేటినిజం ప్రతినిధి) ఈనెల 17న జరుపుకునే బక్రీద్ ఈదుల్ అజ్హా పండుగ ఏర్పాట్లను మున్సిపల్ కార్పోరేషన్ ద్వారా ఘనంగా చేయాలని నగర మేయర్ సునీల్ రావుకు, జిల్లా అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయి కు, మున్సిపల్ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ కు, ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఎంఐఎం కార్పొరేటర్లు, నేతలు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ తమ అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాల మేరకు ఈ వినతిపత్రం అందజేశామన్నారు. పవిత్ర బక్రీద్ మాసంలో ఖుర్బానీ బలి ఇచ్చే జంతువుల లో ఆవులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బక్రీద్ నమాజ్ చేసుకునేందుకు వీలుగా ఈద్గాల వద్ద నమాజ్ చేసే స్థలాన్నీ పరిశుభ్రంగా ఉంచాలని, ప్రస్తుతం ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న దృష్ట్యా టెంట్లను సౌకర్యం కల్పించాలన్నారు. వృద్ధులకు కుర్చీలను, త్రాగునీటి వసతిని ఏర్పాటు చేయాలన్నారు. ఖుర్బానీ అయ్యాక, పశు వ్యర్థాలను తరలించేందుకు మున్సిపల్ కార్పొరేషన్ ద్వారా ట్రాక్టర్లను మూడు రోజుల పాటు ముస్లిం కాలనీల్లో అందుబాటులో ఉంచాలన్నారు. బ్లీచింగ్ పౌడర్ ను ముస్లిం కాలనీల్లో ఇంటింటికి పంపిణీ చేయాలన్నారు. ఈకార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమి, ఎంఐఎం నగర ప్రధాన కార్యదర్శి సయ్యద్ బర్కత్ అలీ, జాయింట్ సెక్రటరి ఆతిన, ఖమరొద్దీన్, ఇబ్రహీం, కార్పొరేటర్లు అఖీల్ ఫిరోజ్, శర్ఫుద్దీన్, నాయకులు అలీ బాబా, అజర్ దబీర్, సాజిద్, మజహరొద్దీన్, ఖాలీద్ తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి చల్మెడ పరామర్శ



రాజన్న సిరిసిల్ల, జూన్ 10 :(నేటినిజం ప్రతినిధి): కోనారావుపేట మండలం మంగళపల్లి గ్రామానికి చెందిన ఔరం శరత్ తల్లి ఔరం రాజవ్వ ఇటీవల మృతి చెందిగా సోమవారం బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు గారు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని తెలియజేశారు. వారి వెంట సీనియర్ నాయకులు రాఘవరెడ్డి, ఎంపీపీ చంద్రయ్య గౌడ్, మాజీ సర్పంచ్ సంతోష్, ప్యాక్స్ చైర్మన్ రామ్మోహనరావు, గెంట శ్రీనివాస్, ఉప్పుల శ్రీనివాస్, మైలారం రాము, మధు, రాజు, దినకర్ తదితరులు ఉన్నారు.

# వంటగదిలో పేలిన గ్యాస్ సిలిండర్.. ప్రాణాపాయం నుంచి తప్పించుకున్న మహిళ

న్యూఢిల్లీ, జూన్ 10 : వంటగదిలో గ్యాస్ సిలిండర్ పేలింది. అయితే ఆ సమయంలో అక్కడ ఉన్న మహిళకు ప్రాణాపాయం తప్పింది. గ్యాస్ సిలిండర్ పేలుడు ధాటికి కింద పడి తేరుకున్న ఆమె భయంతో వంట గది నుంచి పరుగెత్తింది. సీసీటీవీలో రికార్డైన ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఒక మహిళ వంట గదిలో పని చేస్తున్నది. ఊహించని విధంగా అక్కడ ఉన్న గ్యాస్ సిలిండర్ పేలింది. పేలుడు ధాటికి ఆమె నేలపై పండింది. అలాగే వంటగదిలోని వస్తువులు చెల్లాచెదురుగా పడ్డాయి .కాగా, గ్యాస్ సిలిండర్ పేలుడు తీవ్రతకు కిందపడిన ఆ మహిళ భయాందోళన చెందింది. పైకి లేచిన ఆమె అరుస్తూ వంటగది నుంచి బయటకు పరుగెత్తింది. పేలుడు శబ్దం విన్న ఒక వ్యక్తి అక్కడికి వచ్చాడు. మరోవైపు ఆ రూమ్‌లోని సీసీటీవీలో రికార్డైన ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. జూన్ 6న గురువారం ఉదయం 6 గంటలకు ఈ సంఘటన జరిగినట్లు వీడియో క్లిప్ ద్వారా తెలుస్తున్నది. అయితే ఇది ఎక్కడ జరిగిందో అన్నది తెలియలేదు. కాగా, గ్యాస్ సిలిండర్‌తో వంట చేసే మహిళలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పలువురు నెటిజన్లు సూచించారు.

# కేంద్రమంత్రి బండి సంజయ్‌ని మర్యాదపూర్వకంగా కలిసిన బిజెపి కార్పొరేటర్లు....



కరీంనగర్, జూన్ 10 : (నేటినిజం ప్రతినిధి) బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి,పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ కేంద్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన నేపథ్యంలో కరీంనగర్ బిజెపి కార్పొరేటర్లు సోమవారం ఢిల్లీలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ ని కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో కరీంనగర్ పట్టణ (1) ఇన్చార్జి , కార్పొరేటర్ కొలగని శ్రీనివాస్ , పెద్దపల్లి జితేందర్, కాసర్ల ఆనంద్,చొప్పరి వేణు ఉన్నారు.

# ప్రజావాణిలో పురుగుల మందు డబ్బాతో రైతు హల్‌చల్.. దిగొచ్చిన అధికారులు



మంచిర్యాల, జూన్ 10 :మామిడి పంట అమ్మి నెల రోజులైనా డబ్బులు ఇవ్వడం లేదని, అధికారులు కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిప్పించుకుంటున్నారంటూ ఓ రైతు ప్రజావాణిలో పురుగుల మందు డబ్బాతో హల్‌చల్ చేశాడు. ఈ ఘటన మంచిర్యాల జిల్లా నెన్నెల మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం జరిగింది. చిత్తాపూర్ గ్రామానికి చెందిన రామడుగు జనార్దన్ నెల క్రితం 6 టన్నుల మామిడి కాయలను రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రంలో విక్రయించాడు.

ఐకేపీ వారు హర్యానాకు చెందిన విగ్రో సంస్థతో కలిసి కొనుగోళ్లు చేపడుతుండగా, ఏ గ్రేడ్ మామిడి కిలోకు రూ. 35 ,బీ గ్రేడ్‌కు రూ. 30 చొప్పున ధర నిర్ణయించారు. పంట అమ్మి నెల కావస్తున్నా దాట వేస్తూ వస్తున్నారని మండిపడుతూ మరొక రైతు శ్రీనివాస్‌తో కలిసి సోమవారం ఐకేపీ కార్యాలయానికి వచ్చాడు. రూ. 1.20 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

జనార్దన్ మందు డబ్బాతో కార్యాలయం ముందు దాదాపు మూడు గంటల పాటు కూర్చున్నా అధికారులెవ్వరూ రాలేదు. దీంతో ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణికి జనార్దన్ మందు డబ్బాతో వెళ్లి తమకు న్యాయం చేస్తారా.. లేదా మందు తాగమంటారా అనడంతో ఎంపీడీవో దేవేందర్ కలగజేసుకొని ఫిర్యాదు తీసుకున్నారు. ఆపై ఎంపీడీవో జిల్లా ఐకేపీ డీపీఎం సంజీవ్‌కు పలుమార్లు ఫోన్ చేయగా, స్పందించలేదు. ఏపీఎంకు ఫోన్ కలిపి రైతు జనార్దన్‌తో మాట్లాడించారు. చివరకు కిలోకు రూ. 35 చొప్పున ఇవ్వడానికి అధికారులు ఒప్పుకోవడంతో రైతు జనార్దన్ శాంతించారు.

# ముళ్ల పొదల్లో భారీగా గంజాయి సంచులు.. స్వాధీనం చేసుకున్న పోలీసులు



ఖమ్మం, జూన్ 10 :(నేటినిజం ప్రతినిధి): రాష్ట్రంలో గంజాయి కట్టడికి ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీసులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. అయినా అక్రమార్కులు ఏదో ఒక విధంగా గంజాయి అక్రమ రవాణా చేస్తూనే ఉన్నారు. తాజాగా సోమవారం ఖమ్మం పట్టణంలోని కొత్త బస్టాండ్ వెనుక ఉన్న ముళ్ల పొదలో గంజాయి లభించడం స్థానికంగా కలకలం రేపింది.

వివరాల్లోకి వెళ్తే..ఖమ్మం కొత్త బస్టాండ్ వెనుక భాగంలో ఉన్న ముళ్ల పొదల్లో గంజాయి దాచిపెట్టారనే సమాచారం మేరకు ఖమ్మం ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సుంకరి రమేష్ సిబ్బందితో కలిసి ముళ్ల పొదల్లో ఉన్న సంచులను బయటకు తీశారు. మూడు సంచుల్లో ఉన్న గంజాయిని తూకం వేయగా 39.5 కిలోలుగా ఉందని సీఐ రమేష్ తెలిపారు. ఈ గంజాయి విలువ రూ. 20 లక్షల మేరకు ఉంటుందని పేర్కొన్నారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని సీఐ తెలిపారు. ఎవరైనా గంజాయి అమ్మినా రవాణా చేసిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేసిన జార్ఖండ్ మాజీ సీఎం భార్య కల్పనా సొరెన్.



న్యూఢిల్లీ, జూన్ 10 :జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి, జేఎంఎం పార్టీ అధ్యక్షుడు హేమంత్ సోరెన్ సతీమణి కల్పనా సోరెన్ ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేశారు. జార్ఖండ్ స్పీకర్ ఆమె చేత ప్రమాణస్వీకారం చేయించారు. ఇటీవల లోక్‌సభ ఎన్నికలతోపాటు జార్ఖండ్‌లోని గంఢే అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో కల్పనా సోరెన్ విజయం సాధించారు.ఈ క్రమంలో సోమవారం సాయంత్రం ఆమె ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమయ్యేందుకు తమకు చాలా తక్కువ సమయం ఉందని అన్నారు. జార్ఖండ్ ప్రజలు తమపై అమితమైన ప్రేమాభిమానాలు చూపిస్తున్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల కోసం మహాకూటమి పార్టీలోని ప్రతి కార్యకర్త తమవంతు బాధ్యత నిర్వహిస్తారని చెప్పారు.

కల్పనా సోరెన్ ప్రమాణస్వీకార కార్యక్రమం జార్ఖండ్ సీఎం చంపాయ్ సోరెన్ సమక్షంలో జరిగింది. ఓ అవినీతి కేసులో జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను ఈడీ అరెస్ట్ చేసింది. దాంతో చంపాయ్ సోరెన్ జార్ఖండ్ సీఎంగా బాధ్యతలు చేపట్టారు. ఈ క్రమంలో వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు కల్పనా సోరెన్‌ను జేఎంఎం స్టార్ క్యాంపెయినర్‌గా కల్పనా సోరెన్‌ను సిద్ధం చేస్తున్నారు.వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో జేఎంఎం విజయం సాధిస్తే కల్పనా సోరెన్‌ను ముఖ్యమంత్రిని చేసే దిశగా ఆ పార్టీ పావులు కదుపుతున్నట్లుగా తెలుస్తున్నది. కాగా ఇవాళ ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం కల్పనా సోరెన్ తన పక్కనే ఉన్న సీఎం చంపాయ్ సోరెన్ కాళ్లకు నమస్కరించారు. పెద్దలపట్ల తనకు ఉన్న గౌరవాన్ని చాటుకున్నారు.

# స్టార్ మాలో ఉమ్మడి కుటుంబ గాథ “ఇంటింటి రామాయణం”




హైదరాబాద్ జూన్ 10 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఒకప్పుడు ప్రతి తెలుగు లోగిలిలో వైభవంగా వెలిగిన ఉమ్మడి కుటుంబాన్ని మరోసారి తెరపైకి తెస్తూ స్టార్ మా “ఇంటింటి రామాయణం” పేరుతో సరికొత్త సీరియల్ మొదలుపెడుతోంది. ఒక కుటుంబం అంటే ముగ్గురికో నలుగురికో కుదించుకుపోయిన ఈ రోజుల్లో అలాంటి ఉమ్మడి కుటుంబాన్ని చూడడమే ఒక కన్నుల పండుగ. ఆ అపురూపమైన ఇల్లు.. ఓ అచ్చమైన బొమ్మరిల్లు.. ముచ్చటైన పొదరిల్లు. దాదాపుగా 20 మంది వున్న ఆ కుటుంబంలో మనుషుల మధ్య అనుబంధాలు, వాటి ఆనవాళ్లు ఎంత అద్భుతంగా ఉండబోతున్నాయో ఈ సీరియల్ తెలుగు ప్రేక్షకులకు మళ్ళీ గుర్తుచేయబోతోంది. ఒకప్పుడు మనం చూసి, ఇప్పుడు దూరమైన ఆ మధురానుభూతుల్ని “ఇంటింటి రామాయణం” ప్రియ ప్రేక్షకులకు పంచబోతోంది. సీతమ్మ తల్లి లాంటి కోడలు ఇంటిని నడిపిస్తే అది ఎంత అందంగా ఉంటుందో ఆ ఇంటిని చూసి నేర్చుకోవచ్చు. ఒక ఇంట్లో పెద్దవాళ్లు ఉంటే ఎంత బావుంటుందో ... వాళ్ళ చెప్పే నాలుగు మంచి మాటలు కుటుంబాన్నిఎంత బాగా నడిపిస్తాయో.. ఆ కుటుంబాన్ని చూసి తెలుసుకోవచ్చు. ఒక చిన్న పిల్ల ఇంటికి వెలుగై ఎంత అందంగా ఉంటుందో అక్కడ చూసి సంబరపడవచ్చు. స్టార్ మా లో జూన్ 10 నుంచి రాత్రి 8.30 గంటలకు ఈ సీరియల్ ప్రారంభం కాబోతోంది. రెండు కుటుంబాల మధ్య ఒక పెళ్లితో మొదలైన గొడవ.. ఇంకో పెళ్లితో పరిష్కారం కావాలని తపనపడే ఓ అవని ప్రయత్నం ఎటు దారితీసింది అనేది కథలో ఒక అంశం. అవని అంటే ఆ ఇంటి పెద్దకోడలు. పెద్దకోడలిగా ఆమె తీసుకున్న బాధ్యత విజయవంతం అవుతుందా లేదా అనేదానికి సమాధానం తెలియాలంటే “ఇంటింటి రామాయణం” చూడాల్సిందే. సంతోషంగా వున్న ఇంట్లో కూడా ఒక సమస్య వుంది.. అది పరిష్కారం అవుతుందా? లేక ఆ ఉమ్మడి కుటుంబం లోకి కొత్త సమస్యని తీసుకురాబోతోందా అనే ప్రశ్నకు సమాధానం ఈ ధారావాహిక.

# కరాటేలో వేములవాడ విద్యార్థులకు ముగ్గురికి బ్లాక్ బెల్ట్




రాజన్న సిరిసిల్ల, జూన్ 10 :(నేటినిజం ప్రతినిధి): కరీంనగర్ లో ఇంగ్లీష్ యూనియన్ స్కూల్లో ఆదివారం జరిగిన బ్లాక్ బెల్ట్ గ్రీటింగ్ టెస్ట్ లో వేములవాడ ఒ కినావా స్పోర్ట్స్ కరాటే అకాడమీ ఫౌండర్, మాస్టర్ అబ్దుల్ మన్నాన్ వద్ద శిక్షణ పొందిన విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. బ్లాక్ బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ లో కటాస్, కుమ్మితే, వెపన్స్ శిక్షణ పొందిన కనికరపు. రాజశేఖర్ 2 డాన్ ఋషి, విజయ్ చక్కని ప్రదర్శించారు. వీరికి తెలంగాణ ఒ కి నా వా స్కూల్ చీఫ్ ఎగ్జామినేర్ కె. వసంత్‌కుమార్ బ్లాక్‌బెల్ట్‌లను సర్టిఫికెట్లను అందజేసి అభినందించారు.

# ధరణి పెండింగ్ ఫైళ్ల పరిష్కారం వేగవంతం చేయాలి: అదనపు కలెక్టర్ డి.మధుసూదన్

ఖమ్మం, జూన్ 10 :(నేటినిజం ప్రతినిధి): ధరణి పెండింగ్ ఫైళ్ల పరిష్కారం వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి రెవిన్యూ అధికారులతో ధరణి, రిజిస్ట్రేషన్ల పెండింగ్ పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అదనపు కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ధరణి ఫిజికల్ ఫైళ్ల ఆన్లైన్ అప్లోడ్ ప్రక్రియలో వేగం పెంచాలన్నారు. తహశీల్దార్లు ఫిజికల్ ధరణి ఫైళ్లను అప్లోడ్ చేస్తే, ఆర్డీవోల లాగిన్ కు వస్తాయని, ఆర్డీవోలు పరిశీలించి అదనపు కలెక్టర్ కు సమర్పించాలని అన్నారు. పెండింగ్ స్లాట్ల పరిష్కారం పూర్తి చేయాలన్నారు. పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ రెవిన్యూ అధికారులను ఆదేశించారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: B. Devadas.
**RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com